పలువురు న్యాయమూర్తుల బదిలీ

సూర్యాపేట న్యాయవిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలోని పలువురు న్యాయమూర్తులను బదిలీలు, నియామకాలు చేస్తూ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. సూర్యాపేట ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.ప్రశాంతి కుషాయిగూడలోని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీ అయ్యారు. ఇప్పటి వరకు మిర్యాలగూడ రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న నూగూరి అపూర్వ రవళి సూర్యాపేట ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా రానున్నారు. సూర్యాపేట ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి కామిశెట్టి సురేష్ పదోన్నతిపై కోదాడ సీనియర్ సివిల్ జడ్జిగా ఇప్పటికే బదిలీ అయ్యారు. హైదరాబాద్ నుంచి రజిత గోపు సూర్యాపేట ప్రధాన జూనియర్ సివిల్ జడ్జిగా రానున్నారు. వీరితోపాటు రాష్ట్రవ్యాప్తంగా 17 మంది జూనియర్ సివిల్ జడ్జిలు బదిలీ అయ్యారు.

బోధన రుసుం బకాయిలు చెల్లించాలంటూ ర్యాలీ


సూర్యాపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్య సంఘం జిల్లా నాయకులు

మహాత్మాగాంధీ రోడ్డు (సూర్యాపేట), న్యూస్‌టుడే: మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న బోధన రుసుం బకాయిలను తక్షణమే చెల్లించాలని తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్య అసోసియేషన్(టీపీడీపీఎంఏ) జిల్లా ప్రధాన కార్యదర్శి సైదారావు, మహాత్మాగాంధీ యూనివర్సిటీ కమిటీ సభ్యులు తీకుల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. టీపీడీపీఎంఏ మహాత్మాగాంధీ యూనివర్సిటీ అనుబంధ కళాశాలల ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్టీఆర్ పార్కు నుంచి కలెక్టరేట్ వరకు గురువారం ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం బోధన రుసుంలను సకాలంలో విడుదల చేయకపోవడంతో అధ్యాపకులకు వేతనాలు, భవనాలకు అద్దె చెల్లించే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వివిధ ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆ మిల్లులకు కేటాయింపులు లేనట్లే..!


హుజూర్‌నగర్‌లోని రైస్ మిల్లులు

హుజూర్‌నగర్, హుజూర్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యాన్ని ఈసారి ఎవరి పరిస్థితిలోనూ డిఫాల్ట్ మిల్లర్లకు ఇచ్చేది లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు మిల్లర్లకు సబ్ కమిటీ తేటతెల్లం చేసింది. గతంలో సీఎంఆర్ విషయంలో మిల్లర్ల చరిత్రను చూసి ధాన్యం కేటాయింపులు చేయాలనుకుంటోంది. అందుకే గతంలో సీఎంఆర్ ధాన్యం తీసుకుని సంవత్సరాలుగా తమ వద్దే ఉంచుకుని డిఫాల్టర్లుగా ఉండి ప్రభుత్వ ఒత్తిడి తరువాత బియ్యం పెట్టిన వారిపై కూడా జాగ్రత్తగా ఉండాలని నిర్ణయించుకుంది. ఒకవేళ ప్రభుత్వం దాన్ని కచ్చితంగా అమలు చేస్తే ఈసారి ఉమ్మడి జిల్లాలో దాదాపు 100 మిల్లులకు పైగా ధాన్యం కేటాయింపుల జాబితాలో ఉండే అవకాశం లేదు. అలా కాకుండా కేవలం గత సంవత్సరం వానాకాలం, యాసంగిని పరిగణనలోకి తీసుకుంటే మాత్రం ఉమ్మడి జిల్లాలో దాదాపు 37కు పైగా డిఫాల్ట్ మిల్లులను ప్రభుత్వం బ్లాక్‌లిస్ట్‌లో పెట్టే అవకాశం ఉంది.

☛ ఉమ్మడి జిల్లాలో సీఎంఆర్ ధాన్యం కేటాయింపులు జరుగుతున్న మిల్లులు 196 ఉన్నాయి. ప్రతి సీజన్‌లో ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఈ మిల్లులకు కేటాయించి వారి నుంచి బియ్యం తీసుకుంటుంది. సీఎంఆర్ బియ్యం ఇవ్వడంలో కొంత కాలం నుంచి మిల్లర్లు వారి ఇష్టానుసారం ప్రవర్తించడంతో ప్రభుత్వానికి ఇబ్బందిగా మారింది.

ఉమ్మడి జిల్లాలో సీఎంఆర్‌లో భాగస్వామ్యం అవుతున్న మిల్లులు

జిల్లా	పచ్చిబియ్యం మిల్లులు	బాయిల్డ్ బియ్యం మిల్లులు
నల్గొండ	22	63
సూర్యాపేట	24	40
యాదాద్రి	12	35

రూ.కోట్లు విలువ చేసే బియ్యం మిల్లర్ల వద్ద ఉండిపోవడంతో పౌరసరఫరాలశాఖ అప్పుల ఊబిలో కూరుకుపోయింది. దీని నుంచి బయటపడేందుకు ప్రభుత్వం అనేక ప్రయత్నాలు ప్రారంభించి కొంత మేర విజయవంతమైంది. గతంలో కొంత ధాన్యాన్ని వేలం వేసి అమ్ముకుని చేసిన సంగతి తెలిసిందే. దాని విషయంలోనూ అనేక ఇబ్బందులు ఎదుర్కొంది. వీటన్నింటిని పరిగణనలోకి తీసుకుని ఈసారి ధాన్యం కేటాయింపులు జాగ్రత్తగా చేయాలని కృతనిశ్చయంతో ఉంది.

☛ 2019-20 నుంచి 2022-23 వరకు నాలుగు సంవత్సరాల లెక్క ప్రకారం ఉమ్మడి జిల్లాలో దాదాపు 100 వరకు డిఫాల్ట్ మిల్లులు ఉన్నట్లు అధికారులు లెక్కలు చూపుతున్నారు. గత సంవత్సరం ప్రకారం చూస్తే ఉమ్మడి జిల్లాలో వానాకాలంలో 20 మిల్లులు, రబీలో 17 మిల్లులు డిఫాల్ట్ జాబితాలో ఉన్నట్లు సమాచారం. ప్రభుత్వం గత చరిత్ర తీసుకుంటే ధాన్యం కేటాయింపులు చేసుకునేందుకు కొత్త మిల్లులకు అవకాశం కల్పించాల్సి వస్తుంది. గత సంవత్సరం మాత్రమే తీసుకుంటే పెద్దగా ఇబ్బందులు ఉండకపోవచ్చు. ముఖ్యంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన సన్నరకాల ధాన్యాన్ని నేరుగా గోదాముల్లోకి తరలించాలని నిర్ణయించినందున ఇక దొడ్డు రకాల ధాన్యం కేటాయింపులకు ఇబ్బందులు ఏర్పడవని అధికారులు అంటున్నారు.

గురుతర బాధ్యత మీదే..!


రాజపేట మండలంలో నూతనంగా చేరుతున్న ఉపాధ్యాయులు (పాతచిత్రం)

రాజపేట, భువనగిరి, న్యూస్‌టుడే:

సర్కారు బడుల్లో మరింత నాణ్యమైన విద్యాబోధనకు ఎంతో పోస్టులు, ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియ వడివడిగా జరిగింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, విద్యా ప్రమాణాల పెంపే లక్ష్యంగా ముందుకు సాగాల్సిన సమయం ఆసన్నమైంది. డీఎస్సీ-2024 ద్వారా ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా వివిధ విభాగాలకు చెందిన 1,109 మంది ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైన వారు తమకు కేటాయించిన పాఠశాలల్లో విధుల్లో చేరారు. తొలిరోజు విద్యార్థులకు పాఠాలు బోధించి తమ ఇన్నేళ్ల కష్టానికి ఫలితం దక్కిందని ఆనందపడ్డారు. భావి పౌరులుగా ఎదిగే విద్యార్థులకు వారంతా మార్గదర్శకులు కావాల్సిన అవసరం ఉంది.

ఉమ్మడి జిల్లాలో ఇటీవల విధుల్లో చేరిన వివిధ విభాగాల ఉపాధ్యాయులు..

నల్గొండ	సూర్యాపేట	యాదాద్రి
535	322	252

బడి బయటి పిల్లలు బాట పట్టేలా..



చదువుకోవాల్సిన వయసులో పలు కారణాలతో బాలలు బడులకు దూరంగా ఉంటున్నారు. గత జనవరిలో విద్యాశాఖ చేపట్టిన సర్వేలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 898 మంది బడి బయట పిల్లలు ఉన్నట్లు గుర్తించారు. ముఖ్యంగా చదువు విలువ తెలిసిన మీరు మీ బడుల పరిధిలో చదువుకు దూరమైన బాలలు బడిలో చేరేలా చూడాలి. తల్లిదండ్రులకు చదువు విలువపై అవగాహన కల్పించాలి. వారి కుటుంబాల్లోని బాలలు పనుల వైపు మళ్లకుండా అక్షర జ్ఞానం కల్పిస్తే వారి గుండెల్లో మీరు చిరస్థాయిగా నిలిచిపోతారు.

నూతన ఒరవడితో పాఠాల బోధన..

కొత్త ఆలోచనలతో ముందుకు సాగే విద్యార్థులే పోటీ ప్రపంచంలో రాణిస్తున్నారు. మీ పరిధి విద్యార్థులకు బట్టీ చదువులకు పరిమితం కాకుండా కొత్త ఆలోచనలు చేసేలా ప్రోత్సహించాలి. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు పలు సామర్థ్య పరీక్షల్లో వెనుకంజలో నిలుస్తున్నారనే ఆరోపణలున్నాయి. బడుల్లో కృత్యాధార బోధన అమలు చేస్తున్నా.. పూర్తి స్థాయిలో ఫలితం ఇవ్వడం లేదు.

★ కొత్తగా చేరిన మీరు సిలబస్ పూర్తి చేశామా.. పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేశామా.. అన్న దానికే పరిమితం కావొద్దు. మీరు చెప్పింది విద్యార్థులు ఎంతవరకు అర్థం చేసుకుంటున్నారు, వారు ఏం నేర్చుకుంటున్నారనే దానిపై దృష్టి పెడితేనే మీ బోధనకు సార్థకత. కృత్యాధార బోధనకు పెద్దపీట వేయాలి. ప్రభుత్వంపైనే ఆధారపడకుండా సొంత పరిజ్ఞానంతో బోధన పరికరాలు తయారు చేసుకుని నూతన ఒరవడితో బోధన సాగిస్తే విద్యార్థులకు ప్రయోజనం.

స్మార్ట్‌ఫోన్ల కంటే పుస్తక పఠనం అలవాటు చేయాలి..



స్మార్ట్‌ఫోన్లకు అన్ని వయసుల వారు బానిసలవుతున్నారు. మీ పరిధి విద్యార్థులు చరవాణులకు బానిసలు కాకుండా వారికి మంచి అలవాట్లు నేర్పించండి. పాఠాలు చదవడానికే పరిమితం చేయకుండా స్ఫూర్తిదాయక వ్యక్తుల జీవిత చరిత్రలు, మంచి సాహిత్యం చదివేలా ప్రోత్సహించండి. చదువు తరువాత ఆటపాటలు, మంచి పుస్తక పఠనం అలవాటు చేస్తే వారు జీవితంలో ఉన్నతంగా ఎదిగేందుకు దోహదపడినవారు అవుతారు.

★ మీ బడిలో విద్యార్థులకు చదివే మీరున్నారన్న భరోసానివ్వండి. విద్యార్థులకు చదువు ఒక్కటే కాదు.. క్రమశిక్షణ, దేశభక్తి, ఆత్మగౌరవం నేర్పించడంపైన దృష్టి పెట్టాలి. వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యకరమైన అలవాట్లు నేర్పించాలి. అప్పుడే మీరు ఉపాధ్యాయ వృత్తికి పరిపూర్ణత తెచ్చిన వారు అవుతారనడంలో సంశయం లేదు.

క్రీడలతోనే అంతర్జాతీయ గుర్తింపు: కలెక్టర్


సూర్యాపేటలో క్రీడా జ్యోతి ర్యాలీ నిర్వహిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ సన్ ప్రీత్‌సింగ్

సూర్యాపేట పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపైనా శ్రద్ధ చూపి గుర్తింపు తెచ్చుకోవాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పేర్కొన్నారు. సీఎం కప్-2024 టార్చ్‌ను గురువారం ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాల వద్ద వెలిగించి ఎస్పీ సన్ ప్రీత్‌సింగ్‌తో కలిసి ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ క్రీడలతోనే అంతర్జాతీయంగా గుర్తింపు వస్తుందని తెలిపారు. ఒలింపిక్స్ క్రీడా పోటీల్లో రాష్ట్ర నుంచి పతకం తెచ్చేందుకు క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. పల్లెల నుంచి ప్రపంచ స్థాయి విజేత కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఈ పర్యటన చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రెజ్లింగ్ కోచ్ నంద కిశోర్, నోడల్ అధికారి మధు, స్పోర్ట్స్ స్కూల్ అధికారి ఆర్‌కె.బోస్, డీవైఎస్‌వో రామచందర్‌రావు, అదనపు ఎస్పీ జనార్దన్‌రెడ్డి, క్రీడాకారులు, ఉపాధ్యాయులు, పీఈటీలు పాల్గొన్నారు.

వాల్మీకి జీవితచరిత్ర నేటి తరానికి స్ఫూర్తి

సూర్యాపేట కలెక్టరేట్: మహర్షి వాల్మీకి జీవిత చరిత్ర నేటితరానికి స్ఫూర్తిగా ఉంటుందని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పేర్కొన్నారు. వాల్మీకి జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో గురువారం ఆ మహర్షి చిత్రపటానికి అదనపు కలెక్టర్ బీఎస్‌లతతో కలిసి పూలమాల వేసి నివాళి అర్పించారు. జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారిణి అనసూయ, ఎస్సీ అభివృద్ధి అధికారిణి లత, డీఆర్డీవో అప్పారావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఎల్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

సూర్యాపేట నేరవిభాగం: శ్రీవాల్మీకి మహర్షి జయంతి జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. మహర్షి చిత్రపటానికి ఎస్పీ సన్ ప్రీత్‌సింగ్ పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ జనార్దన్‌రెడ్డి, ఏఆర్ డీఎస్పీ నరసింహ, డీసీఆర్బీ డీఎస్పీ మట్టయ్య, ఏవో మంజు భార్గవి, ఆర్ఐ నారాయణ రాజు, నరసింహ పాల్గొన్నారు.


సూర్యాపేటలో వాల్మీకి మహర్షి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎస్పీ సన్ ప్రీత్‌సింగ్, పోలీసు అధికారులు

ఆడిపాడి.. ప్రతిభ చూపి

○ ముగిసిన కళా ఉత్సవ్ పోటీలు ○ రాష్ట్ర స్థాయికి ఆరుగురు విద్యార్థుల ఎంపిక

సూర్యాపేట జిల్లా కేంద్రంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న జిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీలు గురువారం ముగిశాయి. ఈ పోటీల్లో జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి సుమారు వంద మంది విద్యార్థులు పాల్గొనగా విభాగాల వారీగా ఆరుగురిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులను జిల్లా విద్యాశాఖ అధికారి కె.అశోక్ అభినందించారు. రాష్ట్ర స్థాయిలోనూ ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.

– సూర్యాపేట సాంస్కృతికం, న్యూస్‌టుడే:

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన వారు

❑ ఒకల్ మ్యూజిక్ విభాగంలో..: కె.రష్మిత(పదో తరగతి, కేజీబీవీ నాగారం)
❑ ఇన్స్ట్రుమెంటల్ మ్యూజిక్ విభాగంలో.. పి.అక్షయ్(9వ తరగతి, జడ్పీహెచ్‌ఎస్ బాలుర కోదాడ)
❑ డ్యాన్స్ కేటగిరిలో.. కె.వర్ష(తొమ్మిదో తరగతి, జయ హైస్కూల్, సూర్యాపేట)
❑ థియేటర్ కేటగిరిలో మోనో యాక్షన్ విభాగంలో.. జి.హర్షిణి(తొమ్మిదో తరగతి, ఎమ్మెస్సార్ సెంట్రల్ స్కూల్, సూర్యాపేట)
❑ విజువల్ ఆర్ట్స్ విభాగంలో.. ఎస్.డి.సాధిక్ (తొమ్మిదో తరగతి, జడ్పీహెచ్‌ఎస్ బాలుర కోదాడ)
❑ ట్రెడిషన్ స్టోరీ టెల్లింగ్ విభాగంలో.. పి.హరీశ్ కుమార్ (తొమ్మిదో తరగతి, జడ్పీహెచ్‌ఎస్ బాలుర కోదాడ) ఎంపికయ్యారు.

సంతోషంగా ఉంది



జి.హర్షిణి, తొమ్మిదో తరగతి, ఎమ్మెస్సార్ సెంట్రల్ స్కూల్, సూర్యాపేట

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయినందుకు సంతోషంగా ఉంది. ఈ పోటీల్లో మొదటి నుంచి ఉత్సాహంగా పాల్గొన్నా. రాష్ట్ర స్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచి పాఠశాలలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకువస్తాను.

చదువుతో పాటు కళలు అవసరం



కె.వర్ష, తొమ్మిదో తరగతి, జయ హైస్కూల్, సూర్యాపేట

మనిషికి చదువు ఎంత అవసరమో, కళలు అంతే అవసరమని మా ఉపాధ్యాయులు చెప్పారు. వారి సూచనలతో జిల్లా కళా ఉత్సవ్ పోటీల్లో రాణించాను. వంద మంది కళాకారులు పాల్గొంటే ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాను.

ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో..



–కె.రష్మిత, పదో తరగతి, కేజీబీవీ నాగారం

టీచర్ల ప్రోత్సాహంతో కళా ఉత్సవ్ పోటీల్లో పాల్గొన్నాను. సంగీతంపై ఉన్న ఆసక్తితో పాటు ఉపాధ్యాయుల సూచనలతో రాణించగలిగాను. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు పేరు ప్రఖ్యాతలు తీసుకువస్తాను.

చీడ పురుగుల నివారణలో జాగ్రత్తలు తీసుకోండి


బేతవోలులో పొలాలను పరిశీలిస్తున్న డీఏవో శ్రీధర్‌రెడ్డి, అధికారులు

చిలుకూరు, న్యూస్‌టుడే: వరి సాగులో చీడ పురుగుల నివారణలో రైతులు ఎప్పటికప్పుడు వ్యవసాయ అధికారుల సలహాలు పాటిస్తూ తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి అన్నారు. బేతవోలులో వరి పొలాలను స్థానిక వ్యవసాయాధికారులు, కేవీకే శాస్త్రవేత్తలు, రైతులతో కలిసి గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గు చూపాలన్నారు. వరిసాగులో అవసరం మేరకే ఎరువులను, పురుగు మందులను పిచికారీ చేయాలన్నారు. ప్రస్తుతం వాతావరణంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా రైతులు సాగులో మెలకువలు పాటించాలని సూచించారు. అనంతరం వరిసాగులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఏడీఏ ఎల్లయ్య, ఏవో శ్రీధర్, ఏఈవో చంద్రశేఖర్, కేవీకే శాస్త్రవేత్తలు కిరణ్, ఆదర్శ్ పాల్గొన్నారు

మూడు రోజులు.. 19 గంటల విచారణ

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: తహసీల్దార్ జయశ్రీ, ధరణి ఆపరేటర్ జగదీశ్‌ల పోలీస్ కస్టడీ గురువారంతో ముగిసింది. ప్రభుత్వ భూమిని ఇతరుల పేర్ల మీదకు అక్రమంగా మార్చి దానిపై రైతుబంధు తీసుకున్నారన్న ఆరోపణపై అరెస్టయిన హుజూర్‌నగర్ గత తహసీల్దార్ జయశ్రీ, ధరణి ఆపరేటర్ జగదీశ్‌లను మూడు రోజులు పోలీస్ కస్టడీకి తీసుకున్న సంగతి తెలిసిందే. మూడు రోజుల్లో దాదాపు 19 గంటల పాటు సీఐ చరమందరాజు వారిని ప్రశ్నించారు. మూడో రోజు కూడా జయశ్రీ విచారణ అధికారి చరమందరాజుకు పూర్తిగా సహకరించినట్లు సమాచారం. చివరి రోజు ఐదు గంటల పాటు విచారణ జరిగింది. హుజూర్‌నగర్‌లో విలువైన భూములు ఎవరి ప్రోద్బలంతో రిజిస్ట్రేషన్ చేశారని ప్రశ్నించినట్లు తెలిసింది. నాయకులు, ఇతర అధికారులు ఎవరెవరు ఉన్నారో విచారించినట్లు తెలిసింది. రామస్వామి గుట్ట వద్ద విలేకర్లకు ఇచ్చిన ప్లాట్లపై తహసీల్దార్ జయశ్రీని విచారించినట్లు సమాచారం. విచారణ ముగిసిన అనంతరం వారిని కోర్టులో హాజరు పరిచి తిరిగి రిమాండ్‌కు తరలించారు. ఇదిలా ఉండగా బెయిల్ కోసం వారు హైకోర్టును ఆశ్రయించినట్లు తెలిసింది.

వసతుల లేమిపై జిల్లా కార్యదర్శి అసంతృప్తి

కోదాడ, న్యూస్‌టుడే: పట్టణంలోని బాపూజీ గ్రంథాలయంలో సరైన వసతులు కల్పించట్లేదని ఉమ్మడి జిల్లా గ్రంథాలయ కార్యదర్శి బాలమ్మ అసంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం గ్రంథాలయాన్ని తనిఖీ చేసి మాట్లాడారు. గ్రంథాలయ కార్యదర్శి మంగ అనుమతి లేకుండా సెలవు పెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి ముందస్తు సమాచారం లేకుండా సెలవు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులను, దిన పత్రికలు చదవడానికి వచ్చే పాఠకులను సమస్యలు ఉన్నాయోనని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు కావాల్సిన పుస్తకాలను త్వరలోనే అందిస్తానన్నారు. గ్రంథాలయ ఆవరణలో చెత్త, చెదారం ఉండొద్దన్నారు.

ఎన్నాళ్లిలా..!

◆ ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న క్యాన్సర్ బాధితులు

నల్గొండ జిల్లా చింతపల్లి మండలానికి చెందిన 42 ఏళ్ల మహిళ రొమ్ము క్యాన్సర్ బారిన పడ్డారు. క్యాన్సర్ నాలుగో స్థాయికి చేరడంతో బాధితులు జనరల్ ఆసుపత్రి ఆలన వార్డులో చేర్చారు. చికిత్స పొందిన ఆమె పది రోజులకు మృత్యువాత పడ్డారు. కుటుంబ సభ్యులు ఎవరూ ఆమెను ఇంటికి తీసుకెళ్లక పోవడంతో రెండు రోజులు పోస్టుమార్టం గదిలో ఉంచి మున్సిపల్ సిబ్బంది ఖననం చేశారు.

వేములపల్లి పరిధిలోని ఓ గ్రామానికి చెందిన 55 ఏళ్ల మహిళ గర్భాశయ క్యాన్సర్ బారిన పడటంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించారు. రూ.3.50 లక్షలకు పైగా ఖర్చు చేసినా ఆరు నెలల వ్యవధిలోనే ఆమె మృత్యువాత పడ్డారు.

నల్గొండ అర్బన్, న్యూస్‌టుడే:

ఉమ్మడి జిల్లాలో క్యాన్సర్ బాధితుల సంఖ్య ఏటికేడు పెరుగుతోంది. మహిళల్లో వచ్చే క్యాన్సర్లు భయాందోళనకు గురి చేస్తున్నాయి. బాధితుల సంఖ్య పెరుగుతున్నా.. ప్రత్యేక వైద్యులు మాత్రం ఉమ్మడి జిల్లాలో ఒక్కరు కూడా అందుబాటులో లేక పోవడం గమనార్హం. నల్గొండ, సూర్యాపేటలో వైద్యకళాశాలలు అందుబాటులోకి వస్తే క్యాన్సర్ లాంటి రోగాలకు శస్త్రచికిత్సలు, కీమో థెరపీ లాంటి వైద్యం అందుబాటులోకి వస్తుందని ఎదురు చూసిన బాధితుల ఆశలు నీరుగారాయి. ఎలాంటి క్యాన్సర్ లక్షణాలు కన్పించినా స్థానికంగా ఉండే జనరల్ ఫిజీయన్ల సూచనతో మాత్రలు వాడటం, లేదంటే హైదరాబాద్‌లోని ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రికి రిఫర్ చేస్తున్నారు. ఆర్థిక స్థోమత ఉన్నవారు ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్సలు పొందుతున్నారు.



మహిళలకు ఇబ్బందికరమే..

జిల్లాలో క్యాన్సర్ల బారిన పడుతున్న మహిళల పరిస్థితి ఇబ్బందికరంగానే ఉంది. గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ బాధితులు 380 మంది ఉన్నారు. రొమ్ము క్యాన్సర్ బాధితులు 461 మంది ఉన్నట్లు వైద్య ఆరోగ్యశాఖ లెక్కలు చెబుతున్నాయి. లెక్కల్లోకి రానివారు కూడా అధికంగానే ఉంటారు.

ఆలన ద్వారా చికిత్స అందిస్తున్నాం:



డా.వేణుగోపాల్‌రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌వో, నల్గొండ

జిల్లాలో ఆలన కింద క్యాన్సర్ బాధితులకు అనుభవం ఉన్న ఎంబీబీఎస్ వైద్యుల ద్వారా చికిత్స అందిస్తున్నాం. ఎంఎన్‌జేలో చికిత్స పొందుతున్న వారికి ప్రత్యేక వాహనం ద్వారా గ్రామాలకు వెళ్లి అవగాహన కల్పించడంతో పాటు మాత్రలు అందజేస్తున్నాం. దీంతో పాటు క్యాన్సర్ నాలుగో స్థాయికి వచ్చిన వారికి చికిత్స అందిస్తున్నాం. చివరి జీవితంలో బాధితులు ఇబ్బంది పడకుండా ఇక్కడ చికిత్స అందించడంతో పాటు పౌష్టిక ఆహారం అందిస్తున్నాం.

ఐదేళ్లలో ఉమ్మడి జిల్లాలో ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొందిన క్యాన్సర్ బాధితుల వివరాలు.. (ఈ ఏడాది సెప్టెంబరు వరకు)

	నల్గొండ జిల్లా				సూర్యాపేట				యాదాద్రి			
ఏడాది	రేడియేషన్	మెడిసిన్	సర్జికల్	రూ.కోట్లల్లో	రేడియేషన్	మెడిసిన్	సర్జికల్	రూ.కోట్లల్లో	రేడియేషన్	మెడిసిన్	సర్జికల్	రూ.కోట్లల్లో
2020	536	2,144	155	6.97	390	1,384	129	4.11	195	952	53	2.89
2021	745	2,851	254	7.80	424	1,905	193	4.96	283	1,454	124	4.29
2022	630	3,290	276	8.40	453	2,704	238	5.10	245	1,661	136	4.31
2023	723	4,257	341	7.62	551	3,191	265	5.11	256	2,223	167	3.41
2024	559	3,674	317	6.61	389	2,680	247	2.43	234	1,855	174	2.13

ఇంట్లోనే అల్లి.. రికార్డులకెక్కి



అల్లికల తయారీలో వసంతలక్ష్మి

మొదటి స్థానంలో నిలిచి..

కోదాడ, న్యూస్‌టుడే: కొందరు మహిళలు ఇంట్లో పనులు చేస్తూనే తమకు నచ్చిన రంగాల్లో రాణించి పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. వారిలో కోదాడ పట్టణానికి చెందిన మహంకాళి వసంతలక్ష్మి ఒకరు. కుట్టు, అల్లికల విభాగం పోటీలో గిన్నిస్ వరల్డ్ రికార్డుల్లో చోటు దక్కించుకుంది. ఇటీవల విశాఖపట్నంలో ప్రశంసా పత్రం, అవార్డు అందుకున్న సంగతి తెలిసిందే. కుట్టు, అల్లికల విభాగంలో గిన్నిస్ వరల్డ్ రికార్డు ప్రతినిధుల బృందం విశాఖపట్నం కేంద్రంగా ఈ పోటీలను నిర్వహిస్తుంది. గత ఏడాది డిసెంబరులో ఈ పోటీలను ప్రారంభించి ఈ ఏడాది సెప్టెంబరు 15 వరకు నిర్వహించింది. ఈ పోటీలో పాల్గొన్న మహిళలు గత పది నెలలుగా రకరకాల డిజైన్లను తయారు చేయాలి. నిత్యం ఆన్‌లైన్ విధానంలో మహిళలకు నిర్వాహకులు దిశానిర్దేశం చేస్తుంటారు. రోజుకో డిజైన్‌లో అల్లాల్సి ఉంటుంది. ఈ పోటీలో పాల్గొన్న వసంత లక్ష్మి పోటీలు ముగిసే సమయానికి 500లకు పైగా అల్లికలతో మొదటి స్థానంలో నిలిచి, స్టార్ పర్ఫార్మర్ ఆఫ్ ది డ్రైవ్‌గా ఎంపిక య్యారు. ఉలెన్ దారం సాయంతో అల్లికలు చేస్తారు. ఈ దారం విశాఖపట్నం నుంచి తీసుకురావాల్సి ఉంటుంది. మిషన్ లేకుండా చేతులతోనే తయారు చేయాలి. ఒక్కో దానికి మూడు గంటల నుంచి పది గంటల వరకు సమయం పడుతుంది. పోటీదారులు తయారు చేసిన అల్లికలను అనాథ పిల్లలకు అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కుటుంబ సభ్యుల సహకారంతో:

- వసంతలక్ష్మి

ఈ పోటీలో పాల్గొన్నప్పటి నుంచి రోజూ రకరకాల డిజైన్ల రూపంలో అల్లికలు తయారు చేశా. మా సోదరి విశాఖపట్నంలో ఉంటుంది. ఆమె సాయంతో ఈ పోటీలో పాల్గొని రాణించాను. గిన్నిస్ రికార్డుల్లో చోటు దక్కుతుందని ఊహించలేదు. ఈ అవార్డు సాధించడంలో నా భర్త, కుటుంబ సభ్యుల సహకారం ఎంతో ఉంది.

అరచేతిలో ఓటరు సమాచారం

★ టీఎస్‌ఈసీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో ఓటు వివరాలు



భానుపురి, న్యూస్‌టుడే: కొత్తగా ఓటు హక్కు వచ్చిన వారు.. మార్పులు చేర్పులు చేసుకున్నవారితో పాటు ఇది వరకు ఓటు ఉన్న వారు.. ఓటు చూసుకొనేందుకు జాబితా కోసం వెతుకుతుంటారు. అలాంటి ఇబ్బందులు లేకుండా ఎన్నికల సంఘం వెబ్‌సైట్లో ఓటు ఉందో లేదో తెలుసుకొనేందుకు ప్రత్యేకంగా వెబ్‌సైట్‌ను రూపొందించింది. ప్రతి ఎన్నికలకు ఎన్నికల సంఘం(ఈసీ) కొత్త ప్రయోగానికి శ్రీకారం చుడుతోంది.

అక్కడ చూసుకోలేని పరిస్థితి..


త్వరలో స్థానిక ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే గ్రామాల్లో తుది ఓటరు జాబితా విడుదల చేశారు. జాబితాను పంచాయతీ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచారు. కానీ చాలామంది అక్కడికి వెళ్లి ఓటరు జాబితా పరిశీలించుకోవడానికి ఇబ్బంది పడుతుంటారు. ప్రత్యేకంగా సమయం కేటాయించాల్సి రావడంతో ఓటు ఉందో లేదో ఇక్కట్లు పడుతుంటారు. తీరా పోలింగ్ సమయానికి తమ ఓటు ఏమైందని ఆందోళన చెందుతుంటారు. అలాంటి సమస్యలు పరిష్కరించేందుకు ఎన్నికల సంఘం ఏర్పాటైనప్పుడు వర్గాలు ప్రత్యేకంగా తరుణంలో సాంకేతిక వినియోగం పెరిగిపోయింది. ప్రతి ఒక్కరి చేతుల్లో స్మార్ట్‌ఫోన్ ఉంటోంది. ఎన్నికల సంఘం తీసుకొచ్చిన వెబ్‌సైట్లోకి వెళ్లి అరచేతిలోనే చూసుకోవచ్చు.

ఓటర్ల వివరాలు	
జిల్లా	ఓటర్లు
సూర్యాపేట	6,83,181
నల్గొండ	10,42,493
యాదాద్రి	5,20,438

తెరిచేదిలా..

ఎన్నికల సంఘం ప్రత్యేకంగా ప్రవేశపెట్టిన వెబ్‌సైట్‌ను చూసుకొనేందుకు ముందుగా గూగుల్‌లోకి వెళ్లి tsec.gov.in అని టైప్ చేయాలి. తెలంగాణ ఎలక్షన్ కమిషన్ పేజీ వస్తుంది. ఇందులో ఫైనల్ రోల్స్ జీపీ/వార్డు వైజ్ ఓటరు లిస్ట్ యాజ్ ఆన్ 28.09.2024 అనే ఐచ్ఛికం ఉంటుంది. దీనిని క్లిక్ చేయగానే జిల్లా, మండలం, గ్రామ వివరాలు నమోదు చేయాలని మరో పేజీ కనిపిస్తుంది. అనంతరం పంచాయతీకి సంబంధించిన ఓటరు జాబితా ప్రత్యక్షమవుతుంది. ఇందులో వార్డుల వివరాలు కూడా ఉంటాయి. మనం ఉండే వార్డుకు సంబంధించిన బాక్సును క్లిక్ చేస్తే అందులో పూర్తి వివరాలుంటాయి.

పచ్చటి కోక ధరించినట్లు.. దృశ్యం ఇట్లుండె..!



నేటి చిత్రం

వేములపల్లి మండలం మిర్యాలగూడ రోడ్‌లో పొలాలన్నీ పచ్చగా..చూపరులకు కను విందు చేస్తున్నాయి.. భూమాత పచ్చటి చీర ధరించినట్లు ఉన్న దృశ్యం ఆకట్టుకుంటోంది.. ఈ నెల చివరి వరి కోతలు ప్రారంభమవుతాయని గ్రామస్థులు తెలిపారు. - ఈనాడు, నల్గొండ

నల్గొండ బిషప్‌ను కలిసిన మంత్రి



బిషప్ కరణం ధమన్‌కుమార్‌తో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నీలగిరి, న్యూస్‌టుడే: నల్గొండ డయాసిస్ క్యాథలిక్ బిషప్ కరణం ధమన్‌కుమార్‌ను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గురువారం ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. బిషప్ గురుపట్టాభిషేకం పొంది 35 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మంత్రి ఆయనను అభినందించారు. మరింత కాలం కొనసాగాలని ఆకాంక్షించారు. మేత్రాసనానికి తనవంతుగా సహాయ, సహకారం అందజేస్తానని హామీ ఇచ్చారు. మంత్రితో పాటు పురపాలిక ఛైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్ మాతంగి సత్యనారాయణ, పాదర్ జోసఫ్, పసల శౌరయ్య, శ్యాంసన్ తదితరులు పాల్గొన్నారు.

స్వామి దర్శనంతో మానసిక ఆనందం: సుమన్



యాదాద్రి ఆలయ సన్నిధిలో సినీనటుడు సుమన్

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి పుణ్యక్షేత్రంలో స్వయంభువులుగా కొలువైన పంచనారసింహుల దర్శనం మానసిక ఆనందం, ప్రశాంతత కలిగిస్తుందని సినీ నటుడు సుమన్ వెల్లడించారు. కుటుంబ సభ్యులతో ఆయన గురువారం ఈ క్షేత్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. మహిమాన్విత దేవాలయాన్ని అద్భుతంగా నిర్మించిందన్నారు. సుమన్ వెంట ఆలయ మాజీ ధర్మకర్త పెలిమెల్లి శ్రీధర్ గౌడ్ ఉన్నారు. దైవ దర్శనం కల్పించిన ఆలయ అధికారులు, వేద పండితులు ఆశీస్సులు అందజేశారు.

పత్తిపంటపై కష్టాలు మొలకెత్తే..



చందంపేట, న్యూస్‌టుడే: ఇటీవల కురిసిన వర్షాలు పత్తి రైతుల పాలిట శాపంగా మారాయి. పత్తి ఏరివేత చేయాల్సిన సమయంలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు తడిచి పత్తి చెట్ల పైనే మళ్లీ మొలకెత్తే పరిస్థితి వచ్చింది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పెట్టుబడులు సైతం వచ్చే పరిస్థితి లేదని వారు వాపోతున్నారు. మొలకెత్తిన పత్తిని కొనుగోలు చేసేందుకు వ్యాపారులు నిరాకరిస్తున్నారు. దీంతో వారు చేసేదేమీలేక ఇంటి ఆవరణలో పత్తిని ఆరబెడుతూ నానా ఇబ్బందులు పడుతున్నారు.

ఏరివేత కాకముందే వర్షాలకు పత్తి పంట పరిస్థితి ఇలా.

దరఖాస్తుల ఆహ్వానం

భూదాన్‌పోచంపల్లి, న్యూస్‌టుడే: జలాల్‌పురం గ్రామంలోని స్వామిరామానందతీర్థ గ్రామీణ సంస్థలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఉపాధి అవకాశాలున్న కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తులు కోరుతున్నట్లు సంస్థ ఇన్‌ఛార్జి డైరెక్టర్ లక్ష్మి తెలిపారు. రెండు నెలల అకౌంట్స్ అసిస్టెంట్(ట్యాలీ) కోర్సుకు బీకాం, పైథాన్ కోర్సుకు డిగ్రీ, బేసిక్ కంప్యూటర్(డాటా ఎంట్రీ ఆపరేటర్) కోర్సుకు ఇంటర్, ఆటోమొబైల్ 2వీలర్ సర్వీసింగ్ కోర్సుకు పదో తరగతి విద్యార్హత ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. శిక్షణ, వసతి ఉచితంగా ఉంటుందని, శిక్షణ అనంతరం కచ్చితమైన ఉపాధి కల్పిస్తామని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 28న సంస్థ ప్రాంగణంలో ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు.

తెలంగాణ జట్టు కెప్టెన్‌గా కొయ్యలగూడెం విద్యార్థి

చౌటుప్పల్, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి 32వ జూనియర్ టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీల్లో పాల్గొన్న తెలంగాణ జట్టుకు చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామానికి చెందిన ఎర్రగుంట అక్షయ్ కుమార్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. ఈ పోటీలు హరియాణా రాష్ట్రంలోని పానిపట్‌లో గురువారం ప్రారంభమయ్యాయి. ఈనెల 20 వరకు కొనసాగనున్నాయి. ప్రస్తుతం ఇంటర్మీడియట్ చదువుతూ క్రికెట్ అకాడమీలో ప్రత్యేక శిక్షణ పొందుతున్నాడు. అండర్-19 విభాగంలో హరియాణా రాష్ట్రంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి పోటీలకు ఇతను కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. 13 మంది సభ్యులున్న తెలంగాణ జట్టుకు కోచ్‌గా వికాస్, మేనేజర్‌గా లతీఫుద్దీన్ వ్యవహరిస్తున్నారు.



తమిళనాడు జట్టుతో పోటీలో టాస్‌లో పాల్గొన్న తెలంగాణ జట్టు కెప్టెన్ కొయ్యలగూడేనికి చెందిన ఎర్రగుంట అక్షయ్‌కుమార్ (నీలం డ్రెస్)

కానిస్టేబుల్ సస్పెన్షన్, సీఐకి ఛార్జిమెమో..

గుర్రంపోడు, న్యూస్‌టుడే: మండలంలోని ముల్కలపల్లికి చెందిన రజిత హత్యకేసు నమోదు విషయంలో అవకతవకలకు పాల్పడిన వ్యవహారంలో గురువారం కానిస్టేబుల్ సత్యనారాయణను సస్పెండ్ చేయగా, కొండమల్లేపల్లి సీఐ ధనుంజయకు ఛార్జిమెమో జారీ చేశారు. బాధితుల నుంచి డబ్బుల వసూలులో కీలకపాత్ర పోషించినట్లు ఆరోపణలున్న కానిస్టేబుల్ సత్యనారాయణను ఎస్పీ శరత్‌చంద్ర పవార్ సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీచేయగా, సీఐ ధనుంజయకు మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ ఛార్జిమెమో జారీచేశారు. ఇప్పటికే హత్యకేసును ఆత్మహత్య కేసుగా నమోదు చేసిన ఆరోపణలపై ఎస్ఐ నారాయణరెడ్డిని సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. హత్య కేసు నమోదు చేయాల్సిన అధికారం సీఐ స్థాయి అధికారికి ఉండగా.. ఈ కేసులో ఆయనకు ఛార్జిమెమోతో సరిపెట్టి బాధ్యత లేని ఎస్ఐ, కానిస్టేబుల్‌పై సస్పెండ్ చర్యలు తీసుకోవటం చర్చనీయాంశంగా మారింది.

చికెన్ ధరలు	
ఫాంరేటు	120-00
రిటైల్	142-00
డ్రెస్డ్	206-00
స్కిన్‌లెస్	234-00

రేషన్ బియ్యం పాలిష్ చేసి అక్రమ రవాణా

★ ఇద్దరి అరెస్టు.. రూ.18 లక్షల సొత్తు స్వాధీనం: ఎస్పీ

నల్గొండ నేరవిభాగం, న్యూస్‌టుడే: రేషన్ బియ్యాన్ని మిల్లుల్లో పాలిష్ చేసి అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేయగా, ఒకరు పరారీలో ఉన్నట్లు నల్గొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. వారి నుంచి రూ.18 లక్షల విలువ చేసే 504.40 క్వింటాళ్ల రేషన్ బియ్యం, రెండు లారీలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు.

★ ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లా కేంద్రానికి చెందిన చీమకుర్తి సుధాకర్ కొన్నేళ్లుగా రైతుల నుంచి సేకరించిన ధాన్యంతో పాటు గుంటూరు, బాపట్ల, నర్సారావుపేటలో రేషన్ బియ్యం తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నాడు. ఆ బియ్యాన్ని స్థానికంగా ఉన్న మిల్లుల్లో పాలిష్ వేయడంతో పాటు నకిలీ బిల్లులు తయారీ చేసి రూ.30 కిలోల చొప్పున నెలకు 10 నుంచి 12 లోడ్‌లను తెలంగాణ, కర్ణాటక, గుజరాత్, రాజస్థాన్ ప్రాంతాలకు అక్రమ రవాణా చేస్తున్నాడు. విశ్వసనీయ సమాచారంతో వాడపల్లి చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేస్తుండగా పట్టుబడిన లారీతో పాటు అతడిని అదుపులోకి తీసుకుని విచారణ చేయగా వాస్తవాలు ఒప్పుకున్నట్లు తెలిపారు.

★ ఇదే క్రమంలో కర్ణాటక రాష్ట్రానికి చెందిన సయ్యద్ సలావుద్దీన్ అనే లారీ డ్రైవర్ గురువారం లోడు రేషన్ బియ్యంతో వెళుతుండగా పౌరసరఫరాల శాఖ అధికారులకు సమాచారం రావడంతో అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. గుంటూరు జిల్లా కేంద్రానికి చెందిన మరో నిందితుడు అశోక్ పరారీలో ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్ రాజు, రూరల్ సీఐ వీరబాబు పాల్గొన్నారు.

గుంటూరు కేంద్రంగా నకిలీ పురుగు మందులు

★ అధికారుల తనిఖీలో బహిర్గతం



వీర్లపాలెంలోని ఆగ్రోస్ రైతుసేవా కేంద్రంలో పురుగు మందులను పరిశీలిస్తున్న డీఏవో శ్రవణ్‌కుమార్, తదితరులు

దామరచర్ల, న్యూస్‌టుడే: ఏపీలోని గుంటూరు కేంద్రంగా పేరొందిన కంపెనీల పేరుతో తెలంగాణలో నకిలీ పురుగు మందుల సరఫరా జరుగుతున్నట్లు వ్యవసాయాధికారుల విచారణలో వెల్లడైంది. మిర్యాలగూడతో పాటు దామరచర్ల, అడవిదేవులపల్లి తదితర మండలాల పరిధిలో బ్రాండెడ్ కంపెనీ పేరుతో నకిలీవి రైతులకు విక్రయిస్తున్నారు. దీనిపై ప్రముఖ సంస్థ కంపెనీ ప్రతినిధులు రెండ్రోజుల క్రితం ఫిర్యాదు చేశారు.

◆ జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం మొదట మిర్యాలగూడలోని ఓ ఫర్టిలైజర్స్, సీడ్స్ దుకాణంలో తనిఖీ చేయగా ప్రముఖ కంపెనీ పేరుతో గల నకిలీ పురుగు మందులు ఉన్నట్లు గుర్తించారు. రూ.52,900 విలువైన 11 కిలోల బరువుగల 23 సాచెట్లను స్వాధీనం చేసుకున్నారు. దుకాణదారుడిని ప్రశ్నించగా.. ఓ వ్యక్తి మధ్యవర్తిగా వ్యవహరించి డీలర్ నుంచి సరకు తమకు అందినట్లు తెలిపారు. సమాచారం ప్రకారం మండలంలోని వీర్లపాలెంలోని ఆగ్రోస్‌రైతు సేవా కేంద్రాన్ని అధికారులు తనిఖీ చేయగా అక్కడా నకిలీవి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. గుంటూరు నుంచి ధనావత్ రమేష్ ఈ ప్రాంతంలోని పలు దుకాణాలకు నకిలీ మందులు సరఫరా చేస్తున్నట్లు ఓ దుకాణ యజమాని వివరించారు.

◆ డీఏవో మాట్లాడుతూ.. నకిలీవి విక్రయిస్తున్న దుకాణదారుల అనుమతులను రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వీటిపై రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కంపెనీలకు సంబంధించిన ఇన్వాయిస్‌లను రైతులకు చూపించాలని, కొనుగోలు బిల్లులు అందించాలని ఆదేశించారు. అక్రమాలకు పాల్పడుతున్న దుకాణదారులపై చర్యలు తీసుకోవాలని వాడపల్లి పోలీస్‌స్టేషన్‌లో వ్యవసాయాధికారులు ఫిర్యాదు చేశారు. ఏడీఏ దేవ్‌సింగ్, ఏవో సైదానాయక్ తదితరులున్నారు.

ఊరంతా ఖాళీ..!



పొలాలు వద్ద చెట్ల కింద సేద తీరుతున్న గ్రామస్థులు

వేములపల్లి న్యూస్‌టుడే: నల్గొండ జిల్లా వేములపల్లి మండల పరిధిలోని శెట్టిపాలెం గ్రామాన్ని గురువారం గ్రామస్థులందరూ మూకుమ్మడిగా ఖాళీ చేశారు. ఏడాది కాలంగా గ్రామంలో వరుస మరణాలు జరుగుతున్నాయని, ఊరికి కీడు సోకిందనే అనుమానంతో గ్రామపెద్దలు ఒకరోజంతా గ్రామానికి వెలుపల ఉండాలని నిర్ణయించారు. తెల్లవారగానే ఇంటి ముందు కళ్లాపి కూడా చల్లకుండా ఇళ్లకు గ్రామంలోని హోటళ్లు, దుకాణాలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలకు తాళాలు వేయడంతో ఊరంతా నిర్మానుష్యంగా మారింది. గ్రామంలో మొత్తం 1250 కుటుంబాలుండగా సుమారు 5500 జనాభా నివాసముంటున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి సుమారు 76 మంది పలు కారణాలతో మృతిచెందారు. అందులో 32 మంది యువకులు, 21 మంది 50 ఏళ్లలోపు వారు, 23 మంది వృద్ధులున్నారు. వీరిలో గడిచిన రెండు నెలల్లోనే సుమారు 20 మందికి పైగా మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు. తాళం వేసి పొలిమేరలో ఏర్పాటు చేసిన నిప్పును తీసుకొని వ్యవసాయ బావులు, భూములు, శివారు ప్రాంతాలకు తరలివెళ్లారు. అక్కడే వంటావార్పు చేశారు. సాయంత్రం తిరిగి ఇంటి బాట పట్టారు.



నిర్మానుష్యంగా మారిన శెట్టిపాలెం గ్రామం

కాల్వలో పడి మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

త్రిపురారం, న్యూస్‌టుడే: మతి స్థిమితం సరిగా లేక ముదిమాణిక్యం కాల్వలో పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. . ఖమ్మం పట్టణంలోని సాయిగణేష్ నగర్‌కు చెందిన కన్నెకంటి గోపి కిషోర్ (57)కు నాలుగేళ్ల నుంచి మానసిక ఆరోగ్య పరిస్థితి బాగాలేదు. కుటుంబసభ్యులు ఆసుపత్రిలో చూపించినా పరిస్థితి మారలేదు. అప్పటి నుంచి ఇష్టం వచ్చినట్లుగా తిరుగుతున్నాడు. ఆ క్రమంలో ఈనెల 12న ఇంటి నుంచి బయటకు వెళ్లి గురువారం త్రిపురారం మండలం నీలాయిగూడెం పంచాయతీ పరిధిలోని ఘంటరావుక్యాంపు సమీపంలో ముదిమాణిక్యం కాల్వలో పడి మృతిచెందాడు. విషయం స్థానికులు పోలీసులకు తెలుపగా.. మృతదేహాన్ని మరణోత్తర పరీక్షల నిమిత్తం మిర్యాలగూడ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుమారుడు హరిదీస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో విద్యార్థి ..

పెద్దఅడిశర్లపల్లి, న్యూస్‌టుడే: అనుమానాస్పద స్థితిలో బాలుడు మృతి చెందిన ఘటన పీఏపల్లి మండలం మూనావత్ తండాలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ఈ ఘటన పట్ల గుడిపల్లి ఎస్సై నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. మూనావత్‌తండాకు చెందిన మూనావత్ మోహన్ కుటుంబానికి, అతని పాలివారైన మూనావత్ బెల్లు, అతని కుమారులు కోటేష్, రమేష్‌తో కొద్ది రోజులుగా భూ వివాదాలున్నాయి. ఈ విషయమై బుధవారం సాయంత్రం మోహన్ కుటుంబానికి, బెల్లు కుమారులు కోటేష్, రమేష్‌లతో వ్యవసాయ పొలం వద్ద గొడవ జరిగింది. తర్వాత కొద్ది సేపటికి మూనావత్ మోహన్ కుమారుడు(13) ఇంట్లో కిటికీకి ఉరేసుకుని మృతి చెందాడు. మృతుడు హైదరాబాద్‌లో చదువుతుండగా సెలవుల నిమిత్తం ఇంటి వద్ద ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అతని మృతి పట్ల మోహన్ కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఘటనా స్థలాన్ని కొండమల్లేపల్లి సీఐ ధనుంజయగౌడ్ పరిశీలించారు. ఈ విషయమై మోహన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు కిందపడి యువకుడి బలవన్మరణం

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: పురుగు మందు తాగి అనంతరం రైలు కింద పడి యువకుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన గురువారం మిర్యాలగూడ రైల్వేస్టేషన్ సమీపంలో వెలుగు చూసింది. రైల్వే ఎస్సై పవన్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ-కొంద్రపోల్ మధ్య రైలు పట్టాలపై యువకుడి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కాలేజీ బ్యాగులో లభించిన ఐడీ కార్డు ఆధారంగా విచారణ చేపట్టి వివరాలు కనుక్కున్నారు. హైదరాబాద్‌లోని ఓ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న త్రిపురారం మండలం అల్వాలపాడు గ్రామానికి చెందిన విద్యార్థి (18).. దసరా సెలవులకు ఇంటికొచ్చి.. తిరిగి కళాశాల హాస్టల్‌కు వెళ్తున్నట్లు తల్లిదండ్రులతో చెప్పి బుధవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లాడు. అదే రోజు రాత్రి గుర్తుతెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించామన్నారు.

మృతదేహం పక్కనే పురుగు మందు డబ్బా పడి ఉండడంతో.. అది తాగిన అనంతరం రైలుకు ఎదురెళ్లి బలవన్మరణానికి పాల్పడి ఉండొచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతదేహానికి శవపరీక్ష అనంతరం తల్లిదండ్రులకు అప్పగించి.. వారిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్సై తెలిపారు.

వైభవంగా గంధం ఊరేగింపు

నీలగిరి, న్యూస్‌టుడే: సయ్యద్ షా లతీవుల్లా ఖాద్రీ దర్గా ఉర్సు ఉత్సవాల్లో భాగంగా గురువారం గంధం ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. స్థానిక మదీనా మజీద్ నుంచి గంధం ఊరేగింపును మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. పోలీసు శాఖ తరపున దర్గాకు సమర్పించే గంధం ఎస్పీ శరత్ చంద్ర పవార్ ప్రారంభించారు. గంధం ఊరేగింపుగా మసీదు నుంచి పెద్దగడియారం చౌరస్తా మీదుగా ప్రకాశంబజార్, అంబేడ్కర్ చౌరస్తా, వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్, నెహ్రూగంజ్ నుంచి లతీవుల్లా ఖాద్రీ దర్గ వద్దకు చేరుకుంది. గుట్ట మెట్ల వద్ద అధికారులు, ప్రజా ప్రతినిధులు గంధం, పంకాలకు స్వాగతం పలికారు. ముతావలీలు గుట్టపైన లతీవుల్లా ఖాద్రీ దర్గా వద్ద గంధం సమర్పించారు. కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్, ఆర్డీవో శ్రీదేవి, తహసీల్దార్ శ్రీనివాస్, పురపాలిక ఛైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఉర్సు గంధం ఊరేగింపులో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ శరత్ చంద్ర పవార్ తదితరులు

గుట్టపైకి ఘాట్ రోడ్డు వేయిస్తా: మంత్రి కోమటిరెడ్డి

కుల మతాలకు అతీతంగా తెలంగాణలోని అన్ని ప్రాంతాల నుంచి లతీవుల్లా ఖాద్రీ దర్గాను దర్శించుకునే భక్తులు నేరుగా గుట్టపైకి వెళ్లడానికి రూ.30 కోట్లతో ఘాట్‌రోడ్డు నిర్మాణం త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు. ఉర్సు ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు.

చికిత్స పొందుతూ బాలుడి మృతి

భువనగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందిన ఘటన మండలంలోని గౌస్‌నగర్‌లో గురువారం వెలుగుచూసింది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బాలుడు(15) భువనగిరిలోని ప్రైవేటు పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. ఈ నెల 14న సాయంత్రం గేదెలకు పాలు పితికేందుకు తండ్రితో కలిసి వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. పాలకేంద్రంలో పాలు పోసి ఇంటికి తిరిగి వచ్చారు. రాత్రి భోజనం చేసిన అనంతరం కుమారుడు తరచూ ఉమ్మేతుండగా తల్లిదండ్రులు గమనించి ఏమైందని అడగ్గా, వ్యవసాయ బావి వద్ద పురుగు మందు తాగానని చెప్పాడు. వెంటనే కుటుంబ సభ్యులు అతన్ని భువనగిరి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి సికింద్రాబాద్ యశోద ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. తన కుమారుడు ఒంటరిగా దిగాలుగా ఉండేవాడని తండ్రి తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు గ్రామీణ ఎస్సై సంతోష్‌కుమార్ తెలిపారు.

కోదాడ

•కోదాడ •హుజూర్‌నగర్

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

నేరేడుచర్ల, న్యూస్‌టుడే: పాలకవీడు మండలం జాన్‌పహాడ్‌లో ఐకేపీ పరిధిన్యాయం కొనుగోలు కేంద్రాన్ని గురువారం తహసీల్దార్ కమలాకర్ ప్రారంభించారు. గ్రామ కార్యదర్శి వెంకట్, ఎన్.వి.సుబ్బారావు, బి.నర్సింహారావు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



జాన్‌పహాడ్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఇన్‌ఛార్జి తహసీల్దార్ కమలాకర్

దీపాల ఏర్పాటు

కోదాడ పట్టణం: కోదాడలోని ప్రధాన రహదారిపై వీధి లైట్లు లేక ఇబ్బందులు పడుతున్నారని ఇటీవల 'మేమున్నాం.. మీకు తోడుగా'లో ప్రచురించిన సమస్యకు స్పందించి పురపాలకశాఖ వారు వీధి దీపాలు ఏర్పాటు చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) 80085 50363 96030 18889

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే:

? లక్ష్మవరం బైపాస్ రోడ్డు నుంచి సత్యవతి హోటల్ వరకు సీసీరోడ్డు పూర్తిగా పాడవడంతో రాకపోకలకు ఇబ్బంది అవుతుంది. -చంద్రారెడ్డి, హుజూర్‌నగర్

✔ ఇంజినీరింగ్ విభాగం ద్వారా వివరాలు సేకరించి వచ్చే బడ్జెట్‌లో నిధులు కేటాయించి రోడ్డు వేయిస్తాం. -యాకుబ్‌పాషా, పుర కమిషనర్

27న మహా రుద్రాభిషేకం

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: హుజూర్‌నగర్ మహా రుద్రాభిషేకం పండగలా జరుపుకోవాలని మహా రుద్రాభిషేకం నిర్వహణ కమిటీ సభ్యులు లక్ష్మినరసింహారావు, నాగేశ్వరరావు కోరారు. సాయిబాబా కల్యాణ



సమావేశంలో పాల్గొన్న మహిళలు

మండపంలో గురువారం జరిగిన మహా రుద్రాభిషేకం మహిళా భక్తుల కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. లోక కల్యాణార్థం 27న హుజూర్‌నగర్‌లో జరిగే మహా రుద్రాభిషేకం విజయవంతం చేసేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. ప్రతి కుటుంబం తమ బంధుమిత్రులను ఈ మహా క్రతువుకు ఆహ్వానించి కార్యక్రమంలో పాల్గొనేలా చూడాలన్నారు. సమావేశంలో యర్ర విజయ్, సుధాకర్, శ్రీనివాస్, రాంబాబు, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, నరసింహారావు, సేవా కమిటీ అధ్యక్షురాలు వెంకటలక్ష్మి, రేణుక, నాగలక్ష్మి, గిరిజకుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో చదివి.. కొలువు సాధించి..

నేరేడుచర్ల, హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: మహిళలు పట్టుదలకు ప్రతీకలని వీరు మరోసారి నిరూపించారు. పదో తరగతి వరకు తమ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివి కొలువుల సాధనలో సత్తా చాటారు. పేద, వ్యవసాయ కుటుంబాల నుంచి వచ్చిన వీరు పట్టుదలతో చదివి సర్కారు కొలువులు సాధించి ఉద్యోగార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలిచారు.

గ్రూప్స్ లక్ష్యం: కొండ జ్యోతి



మాది నేరేడుచర్ల మండలం కల్లూరు. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి దాకా చదివా. గ్రూప్స్ సాధించడం లక్ష్యంగా పెట్టుకున్నా. గ్రూప్-1 ప్రిలిమ్స్‌లో అర్హత సాధించా. గ్రూప్-2 రాశా. నాకు ఇద్దరు పిల్లలు. వారి బాధ్యతలు చూస్తూనే రోజు ఐదు గంటల పాటు చదివి మొదట టీజీటీగా చౌటుప్పల్ సర్కార్ పాఠశాలలో ఉద్యోగంలో చేరా. ఇటీవల వెలువడిన డీఎస్సీ ఫలితాలలో గణితంలో సూర్యాపేట జిల్లాలో 77.10 మార్కులతో రెండో ర్యాంకు సాధించా. మూడు నెలలు కోచింగ్ తీసుకోవడానికి వెళ్లా. పిల్లల కోసం శిక్షణ మధ్యలోనే వచ్చేయాల్సి వచ్చింది. సొంతంగా సమాచారం తయారు చేసుకొని రోజుకు 5 గంటల పాటు చదివా. నా భర్త గ్రామంలో వ్యవసాయం చేస్తూ ప్రోత్సహించారు.

ఆత్మవిశ్వాసంతో: నాయిని ప్రీతి



ఆత్మవిశ్వాసంతో ప్రయత్నిస్తే ఏదైనా సాధించగలం. మాది నేరేడుచర్ల మండలం పెంచికల్‌దిన్న గ్రామం. వ్యవసాయ కుటుంబం. తల్లిదండ్రులు సైదులు, మణెమ్మ కష్టపడి చదివించారు. పదో తరగతి వరకు పెంచికల్‌దిన్న ప్రభుత్వ పాఠశాలలోనే చదివా. హైదరాబాద్‌లో బీటెక్ సివిల్ పూర్తి చేశా. ఉద్యోగ సాధనకు ఆరు నెలల పాటు శిక్షణ తీసుకున్నా. రోడ్లు, భవనాల శాఖలో ఉద్యోగం సాధించడం ఆనందం కలిగించింది. ఇంజినీరుగా ప్రజలకు సేవలందిస్తా.

పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం

చింతలపాలెం, న్యూస్‌టుడే: పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులకు దూరంగా ఉండొచ్చని జిల్లా ఎపిడెమియాలజిస్టు డాక్టరు సతీష్ అన్నారు. ఇటీవల అతిసార ప్రబలిన చింతలపాలెంలోని ముత్యాలమ్మ ఆలయ పరిసర ప్రాంతాలను గురువారం ఆయన సందర్శించి ఆ ప్రాంత ప్రజలతో మాట్లాడారు. అతిసార బారిన పడకుండా ఉండాలంటే నిత్యం కాచి చల్లార్చిన నీటినే తాగాలన్నారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు.



చింతలపాలెంలో ప్రజలకు సూచనలిస్తున్న వైద్యుడు సతీష్

వ్యక్తిగత పరిశుభ్రతను విస్మరిస్తే రోగాల బారిన పడతారన్నారు. పరిశుభ్రతపై నిత్యం ప్రజల్లో అవగాహన కలిగించాలని సిబ్బందికి సూచించారు. డాక్టరు సచిన్, వైద్య సిబ్బంది వీరయ్య, శ్రీదేవి, రాజ్‌కుమార్, రాములు తదితరులు ఆయన వెంట ఉన్నారు.

సంఘ అభివృద్ధికి సభ్యుల సహకారమే కీలకం

మేళ్లచెరువు, న్యూస్‌టుడే: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు సభ్యుల సహకారమే కీలకమని మేళ్లచెరువు పీఏసీఎస్ ఛైర్మన్ కాకునూరి శంబిరెడ్డి, సీఈవో గుమ్మిత వెంకటరెడ్డి అన్నారు. గురువారం ఇక్కడ నిర్వహించిన మేళ్లచెరువు ప్యాక్స్ సర్వసభ్య సమావేశంలో పలువురు సభ్యులడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. గతంలో కాకుండా సభ్యుల వాటా ధనానికి వడ్డీ వారి ఖాతాల్లోకే జమ చేసే ప్రక్రియకు శ్రీకారం చుడుతున్నట్లు పేర్కొన్నారు. రైతుల అవసరానికి తగినట్లు యూరియా, ఇతరత్రా ఎరువులను అందుబాటులో ఉంచడానికి అభ్యంతరం లేదని, రైతులు తప్పనిసరిగా ప్యాక్స్‌లోనే యూరియా కొనుగోలు చేయాలన్నారు. గోదాంలలో దాన్యం నిల్వలకు రైతులకే తొలి ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోనే ఉత్తమ ప్యాక్స్‌గా మేళ్లచెరువు పీఏసీఎస్‌కు పేరు దక్కిందని, ఈ స్థాయిని ఇంకా పెంచేందుకు సభ్యులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అంతకుముందు పలువురు సభ్యులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ప్యాక్స్ డైరెక్టర్లలో ఈ సర్వసభ్య సమావేశానికి పూర్తి స్థాయిలో హాజరవ్వకపోవడం విచారకరమన్నారు. అంతర్గత సమస్యలుంటే కార్యనిర్వహణ సమావేశంలో మాట్లాడుకోవాలని సూచించారు. సభ్యుల వాటాధనం, రుణమాఫీ విషయంలో సభ్యులకు అర్థమయ్యే రీతిలో వివరాలను వెల్లడించాలన్నారు. గోదాంలలో దాన్యం నిల్వలకు సంబంధించి తొలి ప్రాధాన్యం రైతులకే ఇవ్వాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న శంబిరెడ్డి

ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుపై యూటీఎఫ్ అవగాహన

నేరేడుచర్ల, న్యూస్‌టుడే: నల్గొండ, వరంగల్, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఓటర్ల నమోదుపై టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ అనిల్‌కుమార్ గురువారం పెంచికల్‌దిన్న జడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. అనంతరం మండలంలోని పలు జడ్పీహెచ్ఎస్‌లు, కేజీబీవీ, బీసీ గురుకుల పాఠశాలల్లో సంఘం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. యూటీఎఫ్ మండల అధ్యక్షుడు ఆర్.శీనయ్య, ప్రధాన కార్యదర్శి బి.అశ్విన్‌బాబు, ఎన్.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అనిల్‌కుమార్

రహదారి బాగు చేయాలని రైతుల వినతి

నడిగూడెం, న్యూస్‌టుడే: రామాపురం నుంచి రత్నవరం వరకు వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లేందుకు మట్టిరోడ్డు ఉంది. ఇటీవల కోమరబండ మేజర్ కాల్వ పూడికతీత పనులు చేపట్టి కాల్వలో బురద మట్టిని రోడ్డుపై పోశారు. దీంతో రహదారి బురదమయంగా మారి రైతులు ట్రాక్టర్లు, ఇతర వాహనాలు వెళ్లేందుకు వీలు లేకుండా ఉందని రైతులు వాపోతున్నారు. చివరన ఉన్న వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లాలంటే చుట్టూ ఆరు కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయాల్సి వస్తుందని అధికారులు స్పందించి బురద మట్టిని తొలగించి రహదారిని బాగు చేయాలని రైతులు కోరుతున్నారు.

అధికార పార్టీ దాడులు హేయమైన చర్య: బొల్లం

అనంతగిరి, న్యూస్‌టుడే: కార్యకర్తలకు భారాస పార్టీ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. గురువారం చనుపల్లి గ్రామానికి చెందిన వడిగా శ్రీరామ్ ఇటీవల పార్టీల గొడవల్లో గాయపడగా పరామర్శించి మాట్లాడారు. అధికార పార్టీ నాయకులు అక్రమ కేసులు బనాయించడం, దాడులు చేయడం హేయమైన చర్య అన్నారు. ఇలాంటి దాడులకు పాల్పడితే ప్రతి దాడులు తప్పవని హెచ్చరించారు. పార్టీ మండల అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, శ్రీనివాస్, వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎక్సైజ్ కార్యాలయంలో వాహనాల వేలం

కోదాడ, న్యూస్‌టుడే: పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో శుక్రవారం వాహనాలకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ శంకర్ గురువారం తెలిపారు. దాడుల్లో పట్టుబడిన 2 టీవీఎస్, 2 ద్విచక్ర వాహనాలు మొత్తం 4 వాహనాలకు వేలం నిర్వహిస్తున్నామని, పాల్గొనేవారు ఉదయం 9 గంటలకు కార్యాలయంలో అందుబాటులో ఉండాలన్నారు. ముందుగా ధరావతు చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు.

పలు ఇళ్లలో చోరీ

క్రైం రిపోర్ట్

మేళ్లచెరువు, న్యూస్‌టుడే: రేవూరులో గురువారం చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నాగరాజు, కొండయ్య, కృపానందం, సైదులు, నరేష్ పొలం, ఇతరత్రా పనుల నిమిత్తం ఇళ్లకు తాళం వేసి ఎప్పటిలాగానే బయటకు వెళ్లారు. మధ్యాహ్నం సమయంలో ఎవరూ లేని విషయాన్ని గమనించిన గుర్తు తెలియని వ్యక్తులు తలుపులు తెరిచి ఇళ్లలోకి చొరబడ్డారు. బంగారు, వెండి ఆభరణాలు, కొంత నగదు అపహరించుకెళ్లారు. సమాచారం వచ్చిన వెంటనే ఘటనా స్థలాన్ని పరిశీలించినట్లు ఎస్సై పరమేష్ తెలిపారు. తమకింకా ఫిర్యాదు రాలేదన్నారు.

డీజే యజమానికి రూ.30 వేల జరిమానా

గరిడేపల్లి, న్యూస్‌టుడే: అనుమతి లేకుండా డీజే నిర్వహించిన వ్యక్తికి తహసీల్దారు బండ కవిత రూ.30 వేల జరిమానా విధించినట్లు ఎస్సై చలికంటి నరేష్ తెలిపారు. అనుమతి లేకుండా డీజే నడిపించటంతో మని చెప్పి రూ.లక్ష పూచీకత్తుపై బైండోవర్ చేసినా మళ్లీ కీతవారిగూడెంలో డీజే నిర్వహించారన్నారు. దీంతో అనుమతి లేకుండా డీజే వినియోగించిన వ్యక్తిని పోలీసులు తహసీల్దారు వద్ద హాజరుపరచగా జరిమానా విధించారు. ఇలాంటివి పునరావృతం కావద్దని, డీజేపై నిషేధం ఉన్నందున వాడకూడదని ఎస్సై సూచించారు.

32 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

మునగాల, న్యూస్‌టుడే: అక్రమంగా ఇళ్లలో నిల్వ చేసిన 32 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్న సంఘటన మండలంలోని బరాఖత్‌గూడెంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బరాఖత్‌గూడెంకి చెందిన జిల్లేపల్లి శ్రీను, కత్తి వీరయ్యలు అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని నిల్వ చేసినట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు బృందంతో కలిసి దాడులు నిర్వహించినట్లు చెప్పారు. జిల్లేపల్లి శ్రీను ఇంట్లో 20 క్వింటాలు, కత్తి వీరయ్య ఇంట్లో 12 క్వింటాల పీడీఎస్ బియ్యం పట్టుకున్నట్లు పేర్కొన్నారు. పీడీఎస్ బియ్యాన్ని రాజాకు తరలించి, నిందితులను అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

తనిఖీ చేసి.. సామర్థ్యాలు పరీక్షించి

నడిగూడెం, న్యూస్‌టుడే: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగయ్యేలా సులభరీతిలో బోధన జరగాలని ఎంఈవో బి.ఉపేందర్‌రావు ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం నారాయణపురం, సిరిపురం ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను, ఉపాధ్యాయుల బోధన తీరును పరిశీలించారు. విద్యార్థులను ఆకట్టుకునేలా బోధన చేపట్టాలన్నారు. సీఆర్పీ గోవర్ధన్, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, సుజాత, వెంకన్న పాల్గొన్నారు.

పట్టణ విద్యుత్ ఏఈ బదిలీ

కోదాడ, న్యూస్‌టుడే: గత మూడేళ్లుగా పట్టణంలో విద్యుత్ ఏఈగా పని చేస్తున్న మల్లెల శ్రీనివాస్ బదిలీ అయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన సూర్యాపేట జిల్లా స్టోర్స్ అవుట్ డోర్‌కు ఏఈగా బాధ్యతలు స్వీకరించున్నారు. ఇటీవల కోదాడ పట్టణంలో వచ్చిన వరదలకు సబ్‌స్టేషన్ మునిగిపోయినా, యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయించి విద్యుత్ సమస్యలు పరిష్కరించారని పట్టణ వాసులు ఈ సందర్భంగా ఆయనను సన్మానించారు.

సంస్థ అభివృద్ధికి సహకరించాలి

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: దసరా పండగ సందర్భంగా ఈ నెల 14, 15 తేదీల్లో ఆర్టీసీ ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులను నడిపి సంస్థ ఆదాయానికి కృషి చేసిన సిబ్బందిని నల్గొండ రీజియన్ మేనేజర్ ఎం.రాజశేఖర్ అభినందించారు. కోదాడ డిపోను గురువారం ఆయన సందర్శించి మాట్లాడారు. ఈనెల 14, 15 తేదీల్లో అత్యధికంగా రూ.67 లక్షల ఆదాయాన్ని సమకూర్చారని, ఇదే స్ఫూర్తిని కొనసాగించి సంస్థ అభివృద్ధికి సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ శ్రీహర్ష, అసిస్టెంట్ మేనేజర్ నాగశ్రీ, ఎంఎఫ్ రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతున్న ఆర్ఎం రాజశేఖర్, చిత్రంలో డీఎం శ్రీహర్ష

పదోన్నతులు పొందడం అభినందనీయం

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: పదోన్నతులు పొందడం అభినందనీయమని సాయి మందిరం ఛైర్మన్ నల్లపాటి నర్సింహారావు అన్నారు. నల్లబండగూడెంలోని సాయిమందిరంలో గురువారం 1980-81 పదోతరగతి స్నేహితులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పదోన్నతులు పొందిన పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సైగా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు ఎస్సైగా, పీఆర్ టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మాతంగి ప్రభాకర్‌రావు, మునగాల ఎంఈవో పిడతల వెంకటేశ్వర్లు నూతనంగా బాధ్యతలు చేపట్టడంతో వారిని సన్మానించారు. వీరంతా పదో తరగతి స్నేహితులని ఆయన తెలిపారు. రాంబాబు, హర్షవర్ధన్ సహకారంతో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ద్వితీయ శ్రేణి మెజిస్ట్రేట్ సత్యనారాయణ, మాజీ సర్పంచ్ రంగారావు, శరబయ్య, తదితరులున్నారు.



పదోన్నతులు పొందిన వారిని సన్మానిస్తున్న ఛైర్మన్ నర్సింహారావు

ఆదర్శప్రాయుడు వాల్మీకి

హుజూర్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పర్యవేక్షకుడు శ్రీనివాస రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ దుర్గాప్రసాద్, ఏపీవో శైలజ, సీనియర్ అసిస్టెంట్లు శౌరిరెడ్డి, యాదయ్య, కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చిలుకూరు: చిలుకూరు మండల పరిషత్, తహసీల్ కార్యాలయాల్లో వాల్మీకి జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వాల్మీకి ఆదర్శప్రాయుడని కొనియాడారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. తహసీల్దారు ధ్రువకుమార్, ఎంపీడీవో గిరిబాబు, నాయబ్ తహసీల్దారు కరుణశ్రీ, ఆర్ఐలు శ్వేత, సీతయ్య పాల్గొన్నారు.



హుజూర్‌నగర్‌లో వాల్మీకి జయంతిలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

చెత్తశుద్ధి లోపించి.. దుర్గంధం వ్యాపించి

మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలకు నిత్యం విద్యార్థులు రాకపోకలు సాగించే రహదారి పక్కనే స్థానికులు వేస్తున్న చెత్తను నెలల తరబడి తొలగించక పోవడంతో దుర్గంధం భరించలేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. దీనికి తోడు సమీపంలోని జీవన్‌రెడ్డి కాలనీ నుంచి వస్తున్న మురుగు నీరు సైతం ఇక్కడే నిల్వ ఉండటంతో దోమలు ప్రబలి గ్రామస్థులు అనారోగ్యాల పాలవుతున్నారు. చేపల మార్కెట్‌లోని వ్యర్థాలను సైతం ఇక్కడే వేస్తుండటంతో ఇళ్లలో ఉండలేని పరిస్థితులు నెలకొంటున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రహదారి వెంట చెత్త వేయకుండా ప్రత్యామ్నాయం చూడాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఇన్‌ఛార్జి కార్యదర్శి మట్టయ్య మాట్లాడుతూ శుక్ర, శనివారాల్లో చెత్తను సిబ్బందితో తొలగిస్తామన్నారు. చెత్త వేయడం పునరావృతం కాకుండా చూస్తామన్నారు.

-మఠంపల్లి, న్యూస్‌టుడే



ప్రకృతి వనాల్లో పండ్ల మొక్కలు నాటాలి

మునగాల, న్యూస్‌టుడే: ప్రకృతి వనాల్లో పండ్ల మొక్కలు నాటాలని బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రమేష్ దీన్‌దయాల్‌కు ఈ మేరకు గురువారం వినతి పత్రాన్ని అందజేసి మాట్లాడారు. చెరువు కట్టలపై, రహదారుల వెంట పనికి రాని మొక్కలను నాటడం వల్ల ఉపయోగం లేదని, పండ్లను ఇచ్చే మొక్కలను నాటితే కోతులు గ్రామాల్లోకి రాకుండా ఉంటాయన్నారు.

చిన్నారులకు పోషకాహార లోపం తలెత్తకుండా చూడండి

మోతె, న్యూస్‌టుడే: చిన్నారులకు పోషకాహార లోపం తలెత్తకుండా బలవర్ధకమైన ఆహారం అందించి ఆరోగ్యంగా ఎదుగుదలకు తోడ్పాటునివ్వాలని వైద్యాధికారి డా.నాగరాజు అన్నారు. మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గురువారం సామ్-మామ్ కార్యక్రమంలో మండలపరిధిలోని ఐదేళ్లలోపు చిన్నారులకు వైద్య ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. పిల్లలు వయసుకు తగ్గ ఎత్తు, బరువు, ఆరోగ్యంపై పరీక్షలు నిర్వహించి తల్లులకు ఆరోగ్య సలహాలు సూచనలు అందించారు. అనారోగ్యంగా ఉన్న చిన్నారులను గుర్తించి నల్గొండలోని హయ్యర్ సెంటర్‌కు సిఫారసు చేశారు. ఏ చిన్నారికి ఏపీ పోషకాహారం అవసరమో అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. డాక్టర్ బిందు, ఆర్.శ్రీదేవి, కె.మోక్షరాణి, వైద్యఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

చదువుకున్న పాఠశాలకు దాతృత్వం

నడిగూడెం, న్యూస్‌టుడే: తాను చదువుకున్న పాఠశాల అవసరాలు తీరుస్తూ ఉన్న ఊరు, చదువుకున్న బడి రుణం తీర్చుకుంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు తెల్లబల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థి.. ప్రస్తుతం సైబరాబాద్ క్రైమ్ బ్రాంచ్ ఎస్సైగా పని చేస్తున్న కొల్లు సురేష్‌కుమార్. గతంలో పాఠశాల అవసరమైన డెస్క్ బెంచీలు, మినరల్ వాటర్ ప్లాంట్, విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లు, కుట్టు మిషన్లు బహూకరించారు. తాజాగా కంప్యూటర్, ప్రింటర్‌ను గురువారం సురేష్‌కుమార్ తల్లిదండ్రులు అప్పారావు, లక్ష్మిలు ప్రధానోపాధ్యాయులు పద్మావతికి అందజేశారు. ఎస్సై సురేష్‌కుమార్‌ను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. దాత తల్లిదండ్రులను పాఠశాలలో సత్కరించారు.

పంటకు తెగులు.. రైతన్నకు దిగులు



మునగాల, న్యూస్‌టుడే: ప్రస్తుత సీజన్‌లో వరి పొలాలకు పొట్ట దశలో తాటాకు తెగుళ్లు సోకడంతో రైతులు దిగులు చెందుతున్నారు. బరాఖత్‌గూడెం, నారాయణగూడెం, ముకుందాపురం, కృష్ణానగర్, తాడువాయి గ్రామాల్లో ఈ తెగుళ్ల ప్రభావం ఉన్నట్లు రైతులు తెలిపారు. వాతావరణం, ఉష్ణోగ్రతల మార్పు వల్ల ఈ తెగుళ్లు సోకుతున్నట్లు పేర్కొన్నారు. చిరుపొట్టదశలో ఈ విధంగా మొక్కకొనలు ఎండినట్లు కావడంతో దిగుబడిపై ప్రభావం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉపకార వేతనాలు విడుదల చేయాలి

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంటు వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి వెంకట్ కోరారు. పీడీఎస్‌యూ డివిజన్ కమిటీ సమావేశం గురువారం శ్రామిక భవన్‌లో జరిగింది. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. గత మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు రూ.2500 కోట్లు, రీయింబర్స్‌మెంటు రూ.4 వేల కోట్లు వెంటనే విడుదల చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేటు డిగ్రీ కళాశాలలు బంద్ పెట్టడం వల్ల చదువులకు ఆటంకంగా మారిందన్నారు. ఈనెల 20న కోదాడలో, 24న హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో జరిగే పీడీఎస్‌యూ అర్ధ శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో డివిజన్ కార్యదర్శి రాఖీ, డివిజన్ అధ్యక్షుడు ఉదయ్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

'హామీల అమలులో అలసత్వం'

హుజూర్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజా సంపదను కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతుందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పల్లె వెంకటరెడ్డి, దుగ్గి బ్రహ్మం విమర్శించారు. సీపీఎం పట్టణ మహాసభల్లో భాగంగా పట్టణంలో మూడో శాఖలో గురువారం నిర్వహించిన మహాసభలో మాట్లాడారు. పెట్టుబడిదారుల అనుకూలమైన ఆర్థిక విధానాలను అమలు చేస్తూ దేశాన్ని నాశనం చేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా అలసత్వం ప్రదర్శిస్తుందని, వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని కోరారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, అమరవీరులకు సంతాపం వ్యక్తం చేశారు. ఈ శాఖలో మూడేళ్లుగా పార్టీ నిర్వహించిన ప్రజా పోరాటాల నివేదికను పట్టణ కార్యదర్శి సభ్యులు సభలో ప్రవేశపెట్టారు. అనంతరం మూడో శాఖ కార్యదర్శిగా దుగ్గి వేణు, సహాయ కార్యదర్శిగా వీరబాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సైదులు, శ్రీను, పున్నయ్య, అన్నపూర్ణ, నాగమణి, కల్పన, తదితరులు పాల్గొన్నారు.



హుజూర్‌నగర్‌లో సీతారాం ఏచూరికి నివాళి అర్పిస్తున్న నాయకులు

మేళ్లచెరువు: కేంద్రంలో కార్మిక వ్యతిరేక పాలన నడుస్తోందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పి.వెంకటరెడ్డి అన్నారు. రామాపురంలో గురువారం నిర్వహించిన గ్రామశాఖ మహాసభలో మాట్లాడారు. రైతులు, కార్మికులపై కక్ష కట్టినట్లు మోదీ ప్రభుత్వం చట్టాలను అమలు చేస్తోందని ఆరోపించారు. ఒకే ఎన్నిక విధానమంటే రాష్ట్రాల హక్కులను కాలరాయడమేనని విమర్శించారు. ఈ విధానాలను సీపీఎం ఖండిస్తుందన్నారు. మండల పార్టీ కార్యదర్శి సైదులు, శ్రీను, మురళి, ప్రకాష్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

అవీ ఇవీ

నివాళి.. నేరేడుచర్ల: సీపీఎం ప్రజా సంఘాల్లో ఎర్ర సైదులు చురుకైన పాత్ర పోషించారని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు శేఖర్‌రావు అన్నారు. నేరేడుచర్లలో గురువారం సైదులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. సీపీఎం పట్టణ కార్యదర్శి నగేష్, మండల కార్యదర్శి శ్రీను, జిల్లా కమిటీ సభ్యుడు కె.అనంతప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

అందజేత.. చిలుకూరు: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల ప్రతిభ ఒక్కరూ చేయూతనివ్వాలని ఇన్‌ఛార్జి ఎంఈవో గురవయ్య అన్నారు. నారాయణపురం(పాలెఅగ్రహారం) ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 70 మంది విద్యార్థులకు గ్రామానికి చెందిన దేవరం సైదిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.10 వేల విలువ గల ఐడీ కార్డులు, బెల్టులు, డైరీ తదితర వస్తువులను గురువారం పంపిణీ చేశారు.

ఇందిరమ్మ కమిటీ సభ్యులు కృషి చేయాలి. అనంతగిరి: పేదలకు ఇళ్లు నిర్మించే బాధ్యతను ఇందిరమ్మ కమిటీ సభ్యులు తీసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం కోదాడ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

సత్కారం.. నడిగూడెం: డీఎస్సీలో ఉద్యోగాలు పొందిన రత్నవరం గ్రామానికి చెందిన కొణతం వంశీరెడ్డి, గౌతమిలను గురువారం గ్రామస్థులు అభినందించారు. తొలి ప్రయత్నంలోనే ఉద్యోగాలు సాధించిన దంపతులను సత్కరించారు. పి.వెంకటేశ్వర్లు, వీరారెడ్డి, శ్రీనివాసరావు, లింగయ్య పాల్గొన్నారు.

సినిమాలు

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: **విష్ణురామ్:** దేవర, వేట్టయన్, **శ్రీనివాస:** దేవర, **కాన్సెప్ట్:** వేట్టయన్, విశ్వం, **రంగా:** వేట్టయన్, **వెంకటేశ్వర:** విశ్వం

పరిశ్రమ నిర్మాణాన్ని ఆపాలి

సీపీఐ(ఎం.ఎల్) మాస్‌లైన్

మోతె: రావిపహాడ్ గ్రామ సమీపంలో నిర్మాణంలో ఉన్న ఇథనాల్ పరిశ్రమ పనులను ఆపాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కమిటీ సభ్యుడు కారింగుల వెంకన్న అన్నారు. హుస్సేన్‌బాద్‌లో గురువారం జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా పరిశ్రమ నిర్మాణం చేయడం తగదన్నారు. ప్రభుత్వం తక్షణం కల్పించుకుని నిర్మాణ పనులు నిలిపివేయాలన్నారు. స్పందించకపోతే ప్యాక్టరీని రద్దు చేసే వరకు పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. పీడీఎస్‌యూ రాష్ట్రకార్యదర్శి అఖిల్‌కుమార్, పి.లింగయ్య, యల్లయ్య, గణేష్, మల్సూర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రయోగాలతో శాస్త్రీయ దృక్పథం పెంపు



విద్యార్థులకు సూచనలిస్తున్న ప్రధానోపాధ్యాయుడు రామలింగారెడ్డి

నూతనకల్ గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రయోగాలతో విద్యార్థుల్లో స్వయం అభ్యసన సామర్థ్యాలు, శాస్త్రీయ దృక్పథాలు పెంపొందుతాయని ఎర్రపహాడ్ ఉన్నత పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు రామలింగారెడ్డి అన్నారు. సువెన్ లైఫ్ సైన్సెస్ సహకారంతో అగస్త్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం మొబైల్ ప్రయోగ కార్యశాల నిర్వహించారు. గ్రామీణ విద్యార్థులకు పలు ప్రయోగాలు వివరించారు. శ్రీనివాస్, సైదులు, ధనలక్ష్మీ, వెంకటేశ్వర్లు, స్వరూప, అయోధ్య పాల్గొన్నారు.

సూర్యాపేట

• సూర్యాపేట • తుంగతుర్తి

భానుపురి, న్యూస్‌టుడే:

? సూర్యాపేటలోని శ్రీరాంనగర్‌లో విద్యుత్తు దీపాలు నిరంతరం వెలుగుతున్నాయి. విలువైన విద్యుత్తు వృథా అవుతున్నా సంబంధిత అధికారులెవరూ పట్టించుకోవడం లేదు.
– రమేష్, శ్రీరాంనగర్

✔ సిబ్బందికి ఆన్ ఆఫ్ స్విచ్‌లు ఏర్పాటు చేయిస్తాం. – తిరుమలేష్, పుర ఏఈ, సూర్యాపేట

సూర్యాపేట పురపాలిక, న్యూస్‌టుడే:

? సూర్యాపేటలోని తిరుమలనగర్ ప్రధాన రహదారిలో మురుగు కాల్వలు నిర్మించలేదు. ఖాళీ స్థలాల్లో మురుగు నిలుస్తోంది. దోమలు వృద్ధి చెందాయి. –శ్రీను, తిరుమలనగర్

✔ నిధుల లభ్యతను బట్టి నిర్మిస్తాం.
– శ్రీనివాస్, పుర కమిషనర్, సూర్యాపేట

కష్టాలు ఎదురైనా.. చదువు నాడి పట్టుకొని..

☛ ఎంబీబీఎస్ సీటు సాధించిన సర్కారు బడి పూర్వ విద్యార్థినులు

వైద్యురాలు కావాలన్నది ఆ నిరుపేద విద్యార్థినుల కల. నిరుపేద కుటుంబ పరిస్థితులను అధిగమించి ప్రభుత్వ పాఠశాలల్లో చదివి అనుకున్న లక్ష్యాన్ని సాధించారు. ప్రభుత్వ కళాశాలల్లోనే ఎంబీబీఎస్ సీటు పొంది అందరి చేత శభాష్ అనిపించుకుంటున్నారు ఈ మట్టిలోని మాణిక్యాలు.
– తుంగతుర్తి, న్యూస్‌టుడే



చిన్నతనంలో తల్లిదండ్రులు దూరమైనా..



తాత, నానమ్మలతో కలిసి కేక్ కోస్తున్న శిగ గౌతమి

మండలంలోని వెంపటికి చెందిన శిగ గౌతమికి మూడేళ్ల వయస్సు ఉన్నప్పుడే తల్లిదండ్రులు మృతిచెందారు. ఆమె బాగోగులను తాత రాములు, నాయనమ్మ వెంకటమ్మలు చూసుకున్నారు. గ్రామంలోని సర్కారు బడిలో ఐదో తరగతి ఆ తర్వాత ఇంటర్ వరకు పసునూరు ఆదర్శ పాఠశాలలో చదివారు. వైద్యురాలు కావాలనే కోరికతో మొదటి ప్రయత్నంలో నీట్ పరీక్షకు హాజరై దంత వైద్య కళాశాలలో సీటు సాధించారు. దంత వైద్యురాలు కావడం ఇష్టం లేక మళ్లీ నీట్ రాయాలనుకున్నా.. ఆర్థిక సమస్యలు ప్రతిబంధకంగా మారాయి. చిల్పకుంట్లకు చెందిన సీఐ అంజెపల్లి సుధాకర్ ఆర్థిక సాయం అందించడంతో శిక్షణ తీసుకొని నీట్ పరీక్ష రాసి మెరుగైన ర్యాంక్ సాధించారు. ఇటీవల జరిగిన ఎంబీబీఎస్ కౌన్సెలింగ్‌లో మంచిర్యాల ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు పొందారు. 'నిరుపేదలకు వైద్యం అందించడమే లక్ష్యమ'ని గౌతమి చెప్పారు.

హమాలీ ఇంట మెరిసిన ఆణిముత్యం



మండల కేంద్రానికి చెందిన నారాయణదాసు సత్యనారాయణ, మంగమ్మ దంపతులు నిరుపేదలు. సత్యనారాయణ హమాలీ పని చేస్తుండగా అతని భార్య ఇళ్లల్లో పని చేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు. తుంగతుర్తిలో ఐదో తరగతి వరకు చదివిన పెద్దకుమార్తె అక్షయ తర్వాత హైదరాబాద్‌లోని తన బంధువుల ఇంట్లో ఉండి ఇంటర్ పూర్తిచేశారు. మొదటి ప్రయత్నంలో ఎంబీబీఎస్‌లో సీటు రాక పోవటంతో లాంగ్‌టర్మ్ శిక్షణ తీసుకొని నీట్ పరీక్షలో మంచి ర్యాంకు సాధించారు. కౌన్సెలింగ్‌కు జనగామ ప్రభుత్వ వైద్యకళాశాలలో సీటు పొందారు. నిరుపేద కుటుంబంలో.. ఆర్థిక సమస్యలు ఎదురైనా తమ కుమార్తె పట్టుదలతో చదివి ఎంబీబీఎస్‌లో సీటు సాధించిందని తల్లిదండ్రులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు. 'మా వంశంలో వైద్యులెవరూ లేరు. రాబోయే తరానికి ఆదర్శంగా నిలిచినందుకు ఆనందం ఉంది. నిరుపేదలకు చేయూతనందిస్తాన'ని ఆమె పేర్కొన్నారు.

తండ్రి గుమాస్తా.. కూతురు డాక్టర్



మండలంలోని రావులపల్లికి చెందిన సింగం మల్లయ్య, వనజ దంపతులకు కుమారుడు, కుమార్తె మహేశ్వరి సంతానం. అనారోగ్యానికి గురైన కుటుంబ సభ్యులు, బంధువులు చికిత్స కోసం పడుతున్న కష్టాలు, అవగాహన లోపం, ఆర్థిక సమస్యల వల్ల ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్వయంగా చూసిన మహేశ్వరి చిన్ననాడే వైద్యురాలు కావాలని నిర్ణయించుకున్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవటంతో సొంతూరును వదిలి బతుకుదెరువు కోసం వరంగల్ వెళ్లారు. పిల్లలిద్దరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి తండ్రి గుమాస్తాగా పని చేశారు. పదో తరగతిలో మహేశ్వరి 9.8 జీపీఏ సాధించడంతో ప్రధానోపాధ్యాయుడు గంప అశోక్‌కుమార్ మేధా ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వహించిన పరీక్ష రాయించారు. అందులో మంచి మార్కులు సాధించటంతో సంస్థ సభ్యులు ఆమె ఇంటర్ చదువుకు అయ్యే మొత్తం ఖర్చు భరించడానికి ముందుకు వచ్చి హైదరాబాద్‌లోని శ్రీచైతన్య కళాశాలలో చేర్పించారు. పట్టుదలతో చదివి ఇంటర్‌తో పాటు నీట్‌లో మంచి మార్కులు సాధించిన మహేశ్వరి ఇటీవల కౌన్సెలింగ్‌లో ఉస్మానియా వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు పొందారు. 'భవిష్యత్తులో నిరుపేదలకు ఉచిత వైద్యం అందించి మంచి వైద్యురాలిగా గుర్తింపు సాధించాలని ఉందని ఆమె తెలిపారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

పెన్‌పహాడ్, న్యూస్‌టుడే: మండలంలోని దూపహాడ్ విద్యుత్తు ఉపకేంద్రంలో 8 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను కొత్తగా ఏర్పాటు చేయనున్నట్లు ఏఈ రమేశ్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉపకేంద్రం పరిధిలోని దూపహాడ్, లింగాల, న్యూబంజారాహిల్స్, జల్మాల్‌కుంట తదితర తండాలకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

వాహనాల వేలంలో రూ.3.81 లక్షల ఆదాయం

తుంగతుర్తి, న్యూస్‌టుడే: తుంగతుర్తిలోని ఎక్సైజ్ కార్యాలయంలో నిర్వహించిన వాహనాల వేలం పాటలో రూ. 3.81 లక్షల ఆదాయం వచ్చినట్లు ఎక్సైజ్ శాఖ ఈఎస్ లక్ష్మానాయక్ తెలిపారు. శాఖ ద్వారా నిర్వహించిన దాడుల్లో పట్టుబడిన వాహనాలకు గురువారం నిర్వహించిన వేలంపాటలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా 20 వాహనాలకు వేలం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐలు రజిత, మల్లయ్య పాల్గొన్నారు.



తుంగతుర్తిలో వేలంపాటలో పాల్గొన్న ఈఎస్ లక్ష్మానాయక్, సీఐ రజిత

యువతి అదృశ్యం

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: మండలంలోని ఓ గ్రామంలో యువతి అదృశ్యమైన ఘటన చోటుచేసుకుంది. ఏఎస్సై ఆర్. శంకర్‌నాయక్ గురువారం తెలిపిన వివరాల ప్రకారం... బుధవారం ఇంట్లోంచి కిరాణాకొట్టు వద్దకు వెళ్తున్నానని చెప్పి బయటకు వెళ్లిన యువతి తిరిగి ఇంటికి చేరుకోలేదు. ఆందోళన చెందిన తల్లిదండ్రులు స్థానికంగా వెతికారు. జాడ తెలియకపోవడంతో ఆత్మకూర్(ఎస్) పోలీసులను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

ఎంపీడీవోగా బాధ్యతల స్వీకరణ




నాగారం, న్యూస్‌టుడే: నాగారం మండల ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా కె. మారయ్య గురువారం బాధ్యతలు చేపట్టారు. ఎంపీడీవోగా పనిచేసిన ధార శ్రీనివాస్ మునగాలకు బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో ఎంపీవోగా పనిచేస్తున్న మారయ్య ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టారు.

వెలుగు ఏపీఎంగా రాంబాబు

తుంగతుర్తి, న్యూస్‌టుడే: తుంగతుర్తి వెలుగు కార్యాలయ ఏపీఎంగా రాంబాబు బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వం నిర్వహించిన బదిలీల్లో భాగంగా చివ్వెంల మండలం నుంచి తుంగతుర్తికి బదిలీ అయ్యారు. ఇక్కడ ఏపీఎంగా పని చేసిన నర్సయ్యను చిలుకూరు మండలానికి బదిలీ చేశారు.

ఏవోగా అనీసా రూహి



మద్దిరాల, న్యూస్‌టుడే: మండల వ్యవసాయ అధికారిణిగా అనీసా రూహి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు మద్దిరాలలో ఇన్‌ఛార్జి ఏవోగా పనిచేసిన మల్లారెడ్డి జిల్లా కేంద్రానికి వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన అనీసా రూహికి పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఘనంగా వాల్మీకి జయంతి

నూతనకల్, న్యూస్‌టుడే: నూతనకల్ మండల పరిషత్, తహసీల్ కార్యాలయాల్లో గురువారం వాల్మీకి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్ రావు, ఎంపీవో శశికళ, ఏపీవో శ్రీరాములు, సబిత, పంచాయతీ కార్యదర్శులు చలమయ్య, శర్మ, మధుసూదన్‌రెడ్డి, మల్లయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.



వాల్మీకి చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పిస్తున్న సిబ్బంది

ధరల అదుపులో కేంద్రం విఫలం: సీపీఎం

మద్దిరాల గ్రామీణం: దేశవ్యాప్తంగా పెరుగుతున్న నిత్యావసర సరకుల ధరలను అదుపు చేయడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గోపి అన్నారు. సీపీఎం కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు గురువారం మండల కమిటీ ఆధ్వర్యంలో తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ అమీన్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. మండల కార్యదర్శి కల్లెపల్లి భాస్కర్, మండల నాయకులు కవిత, బ్రహ్మం, మీనయ్య, పాల్గొన్నారు.

మద్దిరాల గ్రామీణం: గోరెంట్ల గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకురాలు బద్దం పూలమ్మ కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందారు. గురువారం గ్రామంలో ఏర్పాటు చేసిన సంస్మరణ సభకు సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు గోపి, నాయకులు శంకర్‌రెడ్డి, సత్యం, మల్లారెడ్డి, పాల్గొన్నారు.



గోరెంట్లలో బద్దం పూలమ్మ సంస్మరణ సభలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి

పోలీసు కుటుంబాల సంక్షేమానికి కృషి: ఎస్పీ



సూర్యాపేటలో బాధిత కుటుంబానికి రూ.8 లక్షల చెక్కు అందజేస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

సూర్యాపేట నేరవిభాగం, న్యూస్‌టుడే: పోలీసు భద్రత పథకంతో సిబ్బంది కుటుంబాలకు భరోసా లభిస్తోందని ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఏఆర్ విభాగంలో పనిచేస్తున్న కానిస్టేబుల్ సైదులు ఇటీవల మృతిచెందారు. అతని కుటుంబ సభ్యులకు పోలీసు భద్రత పథకం ద్వారా గురువారం ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ రూ.8 లక్షల బీమా చెక్కు అందజేసి మాట్లాడారు. హోంగార్డు విభాగంలో పనిచేస్తున్న శ్రీనివాస్, గౌస్‌పాషా, సక్రునాయక్ ఇటీవల మృతిచెందారు. వీరి కుటుంబ సభ్యులకూ హోంగార్డు సంక్షేమ నిధి నుంచి ఆర్థిక చేయూత అందించారు. ఏఆర్ అదనపు ఎస్పీ జనార్దన్‌రెడ్డి, ఏఆర్ డీఎస్పీ నరసింహచారి, ఏవో మంజు భార్గవి, పోలీసు సంఘం అధ్యక్షుడు రామచందర్‌గౌడ్, ఆర్ఐ సత్యనారాయణరాజు, నరసింహ, ఆర్ఎస్సై అశోక్ పాల్గొన్నారు.

పిల్లల సంరక్షణకు ఆర్‌బీఎస్‌కే కార్యక్రమం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట పట్టణం: ఆర్‌బీఎస్‌కే ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పేర్కొన్నారు. రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే)పై గురువారం కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్య, శిశు సంక్షేమ శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్‌బీఎస్‌కే పిల్లల జీవన నాణ్యతను మెరుగుపరిచి సమగ్ర సంరక్షణ అందించే కార్యక్రమని, దీని ద్వారా పుట్టుకతో వచ్చే లోపాలు, వ్యాధులు, వైకల్యంతో అభివృద్ధి ఆలస్యం, లోపాలు గుర్తించనున్నట్లు తెలిపారు. గుండె, చర్మం, డెంటల్ లాంటి 32 సాధారణ ఆరోగ్య పరిస్థితులను పుట్టిన నుంచి 18 సంవత్సరాల పిల్లల్లో ముందస్తుగా గుర్తించి ఉచితంగా చికిత్స, శస్త్ర చికిత్సలతో సహా స్క్రీనింగ్ ఉంటుందన్నారు. జిల్లాలో తొమ్మిది ఆర్‌బీఎస్‌కే బృందాలు ఏర్పాటు చేశామని, ప్రతి బృందంలో ఇద్దరు వైద్యాధికారులు, ఫార్మాసిస్టులు, ఏఎన్ఎంలు ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో కోటా చలం, డీడబ్ల్యూవో నర్సింహారావు, ఆర్‌బీఎస్‌కే కోటిరత్నం, వైద్యాధికారులు, సూపర్ వైజర్లు, ఫార్మాసిస్టులు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

వృత్తివిద్యా కోర్సులతో భవిష్యత్తు

తిరుమలగిరి, న్యూస్‌టుడే: వృత్తి విద్యాకోర్సులు అభ్యసించిన విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని ప్రధానోపాధ్యాయుడు దామెర శ్రీనివాస్ అన్నారు. గురువారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో టూరిజం అండ్ హాస్పిటాలిటీ వృత్తి విద్యాకోర్సులో భాగంగా ఉపాధ్యాయులు విద్యార్థులతో ఫ్రూట్ సలాడ్ ఫెస్టివల్ నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల పండ్ల రసాలను రుచి చూసి వారిని అభినందించారు. కార్యక్రమంలో వృత్తి విద్యా ఉపాధ్యాయులు గోపి, శాంతిప్రియ, సోమయ్య, ఉపేంద్ర, వెంకన్న పాల్గొన్నారు.



విద్యార్థులు తయారు చేసిన పండ్ల రసాల రుచి చూస్తున్న ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు



టీక్యాతండాలో శ్రీనివాస్ కుమార్తెలకు నగదు అందజేస్తున్న ఆ గ్రామ ఉద్యోగులు

రైతు కుటుంబానికి గ్రామస్థుల భరోసా

నూతనకల్, న్యూస్‌టుడే: మండల పరిధిలోని టీక్యాతండాకు చెందిన గిరిజన నిరుపేద రైతు భూక్యా శ్రీనివాస్ సాగుభూమి వద్దకు వెళ్తుండగా పాముకాటుతో ఇటీవల మృతిచెందారు. మృతుడికి భార్య, పదేళ్లలోపు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ యజమానిని కోల్పోయి దిక్కుతోచని స్థితికి చేరుకున్న కుటుంబాన్ని ఆదుకోవడానికి వివిధ ప్రాంతాల్లో వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఆ గ్రామానికి చెందిన ఉద్యోగులు ఆర్థికసాయం చేయడానికి ముందుకు వచ్చారు. ఇప్పటివరకు సేకరించిన సుమారు రూ. 46 వేలు మృతుడి కుటుంబానికి గురువారం అందించారు. మృతుడి కుమార్తెల చదువుకు అండగా ఉంటామని ఉద్యోగులు భరోసా ఇచ్చారు.

ఓంకార్ ఆశయ సాధనకు కృషి

జాజిరెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ఎంసీపీఐ(యూ) వ్యవస్థాపక అధ్యక్షుడు మద్దికాయల ఓంకార్ ఆశయాల సాధనకు కృషి చేయాలని పులే అంబేడ్కర్ ఆశయ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఈదురు వీరపాపయ్య పిలుపునిచ్చారు. అర్వపల్లిలో గురువారం ఓంకార్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎంసీపీఐ నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో దిర్శనపు కృష్ణమూర్తి, పందిరి సురేందర్, మల్లయ్య, పరశురాములు పాల్గొన్నారు.



మద్దికాయల ఓంకార్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

దళారులను ఆశ్రయించవద్దు: ఎమ్మెల్యే సామేల్



తిమ్మాపురంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

జాజిరెడ్డిగూడెం, న్యూస్‌టుడే: రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే మందుల సామేల్ చెప్పారు. మండలంలోని తిమ్మాపురం గ్రామంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు. కేంద్రాల్లో ఎలాంటి అవకతవకలు జరిగినా సహించేది లేదని స్పష్టంచేశారు. రైతులు నాణ్యమైన, ఆరబెట్టిన ధాన్యం తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్, డీసీసీబీ మాజీ ఛైర్మన్ బీరవోలు సోమిరెడ్డి, సామ అభిషేక్ రెడ్డి, అదనపు డీఆర్డీఏ సురేష్, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో పవన్ కుమార్, డీపీఎం ఆంజనేయులు, పీఏసీఎస్ మాజీ ఛైర్మన్ ఇందుర్తి వెంకట్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనిరెడ్డి రాజేందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు మోరపాక సత్యం పాల్గొన్నారు.

తిరుమలగిరి: నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. గురువారం మండలంలోని మామిడాలలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం పురపాలికలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పుర ఛైర్‌పర్సన్ శాగంటి అనసూయ, డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, మండల పార్టీ అధ్యక్షుడు వై. నరేశ్, బత్తుల శ్రీను, పేరాల వీరేశ్, జిమ్మిలాల్ పాల్గొన్నారు.

నాగారం: సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రంలోనే నియోజకవర్గాన్ని మొదట స్థానంలో ఉంచుతానని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. వర్ధమానుకోటలో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆకుల బుచ్చిబాబు, డీసీసీబీ మాజీ అధ్యక్షుడు బీరవోలు సోమిరెడ్డి, ఏపీడీ సురేశ్, డీపీఎం ఆంజనేయులు, ఎంపీడీవో మారయ్య, నాయబ్ తహసీల్దార్ షాహీన్‌బేగం, ఏవో కృష్ణకాంత్, తొడుసు లింగయ్య పాల్గొన్నారు.

తుంగతుర్తి: రైతుల అవసరాల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని ఎంపీడీవో శేషకుమార్ అన్నారు. గురువారం మండలంలోని అన్నారంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కేంద్రాలకు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దుండి రమేష్, సీసీ యాదగిరి, నాయకులు దొంగరి గోవర్ధన్, కిషన్‌రావు, అనూక్ పాల్గొన్నారు.

పీఆర్టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: శాసనమండలి ఉపాధ్యాయ నియోజకవర్గ పీఆర్టీయూ టీఎస్ అధికార అభ్యర్థి పింగిలి శ్రీపాల్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆ సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి తంగెళ్ల జితేందర్‌రెడ్డి, తీగల నరేష్ కోరారు. ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా మండలంలోని వివిధ పాఠశాలల్లో గురువారం ఎన్‌రోల్‌మెంట్ ఫారాలు పంపిణీ చేసి సంఘం అభ్యర్థికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మకూర్(ఎస్)లో వారు మాట్లాడుతూ పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడుగా పనిచేసిన సమయంలో ఉపాధ్యాయులకు 30శాతం పీఆర్సీ ఇప్పించడం, ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 61ఏళ్లకు పెంచడం కేవలం శ్రీపాల్‌రెడ్డికే సాధ్యమైందన్నారు. సంఘ నాయకులు చంద్రశేఖర్, శివశంకర్, తావుర్యానాయక్, పి.నరేందర్‌రెడ్డి, దయాకర్, కె.సత్యనారాయణరెడ్డి, కె.సుదర్శన్‌రెడ్డి, టి.వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.



ఆత్మకూర్(ఎస్)లో ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న తంగెళ్ల జితేందర్‌రెడ్డి

తిరుమలగిరి: ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా అర్హత కలిగిన ఉపాధ్యాయులు ఓటు నమోదు చేసుకోవాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు టి. జితేందర్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ అభ్యర్థి పింగళి శ్రీపాల్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం మండల శాఖ అధ్యక్షుడు కె.అశోకరెడ్డి, ప్రధాన కార్యదర్శి బి.లక్ష్మణ్, మండల విద్యాధికారి ఐ.శాంతయ్య, ప్రధానోపాధ్యాయులు దామెర శ్రీనివాస్, ఎస్. వెంకటేశ్వర్లు, జి. దయాకర్, ఉపేంద్ర పాల్గొన్నారు.

మద్దిరాల: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం పీఆర్టీయూతోనే సాధ్యమవుతుందని ఆ సమాఖ్య జిల్లా అధ్యక్షుడు తంగెళ్ల జితేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలకేంద్రంలోని జడ్పీ పాఠశాలలో నాయకుల ఆధ్వర్యంలో కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికలో పీఆర్టీయూ అభ్యర్థి పింగిలి శ్రీపాల్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు భూక్యా శంకర్‌నాయక్, కామళ్ల మురళి, నాయకులు తీగల నగేష్, మహేశ్వరం వెంకటయ్య, ధరావత్ శివయ్య పాల్గొన్నారు.

చట్టపర చర్యలు తీసుకోవాలి

జాజిరెడ్డిగూడెం, న్యూస్‌టుడే: అర్వపల్లికి చెందిన మాగి పరమేష్ గొర్రెల షెడ్డును ధ్వంసం చేసిన దుండగులపై కేసు నమోదు చేసి చట్టపర చర్యలు తీసుకోవాలని జడ్పీటీసీ మాజీ సభ్యుడు దావుల వీరప్రసాద్ యాదవ్ డిమాండ్ చేశారు. అర్వపల్లిలో దెబ్బతిన్న గొర్రెల షెడ్డును గురువారం భారాస నాయకులతో కలిసి పరిశీలించారు. కడారి నరేష్, పెద్దులు, రాజలింగం, ప్రభు, నాగరాజు, వెంకన్న, రవీందర్ నాయక్ పాల్గొన్నారు.

దేవాలయానికి విరాళం

చివ్వెంల, న్యూస్‌టుడే: మండలంలోని మొగ్గయ్యగూడెం శ్రీసీతారామాంజనేయస్వామి దేవాలయానికి హైదరాబాద్‌కు చెందిన గంగవెల్లి నీరజ విరాళం ప్రకటించారు. గ్రామంలోని దేవాలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. తాము జీవించి ఉన్నంతకాలం దేవాలయంలో ధూప, దీప తదితర సామగ్రికి కావాల్సిన ఖర్చులను స్వయంగా భరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కొనకంచి వీరభద్రయ్య, భూక్యా వెంకన్న, బెక్కం లక్ష్మీనరసయ్య, బుద్ధి లావణ్య, కళావతి పాల్గొన్నారు.

చేతిపంపుల నిర్వహణపై అవగాహన

పెన్‌పహాడ్, న్యూస్‌టుడే: గ్రామాల్లో అంతరాయం లేకుండా మంచినీటి సరఫరా చేసేందుకు తగిన చర్యలు చేపడుతున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పాండు అన్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం వివిధ గ్రామాల మంచి నీటి సహాయకుల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. టెక్నీషియన్లు అఖిల్, భీష్మాచారి చేతిపంపుల మరమ్మతులు, నిర్వాహణపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీవో సంజీవయ్య, ఏఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ ధరలు

భానుపురి, న్యూస్‌టుడే: సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌కు గురువారం వచ్చిన వివిధ పంట ఉత్పత్తులకు పలికిన గరిష్ఠ, కనిష్ఠ ధరల వివరాలు(రూపాయల్లో..)

రకం	గరిష్ఠం	కనిష్ఠం
బీపీటీ	3059	2129
జైశ్రీరాం	3141	2159
ఐఆర్-64	1989	1856
హెచ్ఎంటీ	2889	1971
ఆర్ఎన్ఆర్	2276	2276
కందులు	7695	3695
పెసర	6446	4694
వేరుసెనగ	5609	5089

శిథిలావస్థలో ఆరోగ్య ఉప కేంద్రం



జాజిరెడ్డిగూడెం, న్యూస్‌టుడే: జాజిరెడ్డిగూడెనికి పల్లె దవాఖానా మంజూరైనప్పటికీ ఇక్కడ స్థలం లేకపోవడంతో భవన నిర్మాణం జరగలేదు. ప్రస్తుతం ఆ గ్రామంలోని ఆరోగ్య ఉపకేంద్రం శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు కూలుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గురుకుల పాఠశాల భవనం ఖాళీగా ఉండటంతో అందులోని ఒక గదిలో వైద్యులు తాత్కాలికంగా వైద్యసేవలందిస్తున్నారు. భవనంలేక సిబ్బంది, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 'గ్రామ పంచాయతీ స్థలం ఎంపిక చేసి తీర్మానం ఇస్తే ఉన్నతాధికారులు భవనం మంజూరు చేస్తార'ని ఇన్‌ఛార్జి వైద్యాధికారి నగేష్ తెలిపారు.

నియామక పత్రం అందజేత

నాగారం, న్యూస్‌టుడే: తెలంగాణ దళిత సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడిగా చిప్పలపల్లి ఉపేందర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర ఛైర్మన్ ఈదుల పరశురామ్ ఆయనకు నియామక పత్రం అందించారు.